

మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


# అమ్మకు ప్రేమతో..





- సృష్టికి మూలం అమ్మ..
- తల్లి ప్రేమ వెలకట్టలేనిది..
- నేడు ప్రపంచ మాతృ దినోత్సవం

**మహబూబ్‌నగర్ బ్యూరో, వనపర్తి క్రైమ్, మే 10 ప్రభాతవార్త:** "వేసా మొదటి అడుగు అమ్మ ప్రేమే ఆదిగా" .. అంటూ పాడినా " పెదవే పలికిన మాటల్లోనే తీయని మాటే అమ్మ " అంటూ ఓ కవి రాసినా.. "అమ్మ అమ్మా ..నీ పసివానమ్మ " అంటూ ఓ కొడుకు సినిమాలో తనకు అమ్మపై ఉన్న ప్రేమను చూపించిన వీటన్నింటికీ ఆంతర్యం, అన్నింటికీ మూలం అమ్మే.. ఈ సృష్టిలో అమ్మకు అంత గొప్ప విలువ ఉన్నది.. నేడు ప్రపంచ మాతృ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక "వార్త" కథనం.

అమ్మ.. కేవలం రెండక్షరాల పదం మాత్రమే కాదు నిండు నూరేళ్ల జీవితం. ప్రతి మనిషి జీవితంలో తల్లి స్థానం వెల కట్టలేనిది. అమ్మ అనగానే గుర్తొచ్చేది ఆమె ప్రేమ, త్యాగం, ఎన్నటికీ మారని ఆదరణ. కాలం మారుతోంది, అభిరుచులు మారుతున్నాయి, కానీ తల్లి చూపే ప్రేమ మాత్రం ఎప్పటికీ మారదు. ఈ విశిష్టతను గుర్తు చేసుకుంటూ, మాతృ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే రెండవ ఆదివారం ఎంతో ఆనందంగా జరుపుకుంటాం. నేడు ప్రపంచ వ్యాప్తంగా (మే 11) మదర్స్ డే నిర్వహించుకుంటున్నాం. మీరు ఈ రోజున మీ అమ్మకి జీవితంలో మరపురాని అనుభూతులను అందిద్దాం. ఒక చిన్న బహుమానం ఇచ్చి సర్ప్రైజ్ చేద్దాం. అమ్మకు అంకితం చేసిన ఈ ప్రత్యేక రోజు ప్రతి బిడ్డకు చాలా ప్రత్యేకమైంది. తల్లి ప్రేమ, త్యాగం, అంకిత భావానికి తీపి గుర్తుగా ఈ ప్రత్యేకమైన రోజును నిర్వహించుకుంటాం. ఈ రోజు ప్రతి బిడ్డా తమ గుండెల్లో తల్లిపై దాగి ఉన్న ప్రేమను తమదైన శైలిలో అనుభూతి చెందేలా చేయడానికి ప్రయత్నిస్తారు.

### ఆ రోజు ఎలా వచ్చిందంటే..

కని పెంచిన తల్లి గొప్పతనాన్ని గుర్తుతెచ్చుకోవడం కోసం ప్రతి సంవత్సరం మే నెలలోని రెండవ ఆదివారం (ఎక్కువ దేశాలలో) నాడు జరుపుకుంటారు. మదర్ ఆఫ్ గాడ్స్‌గా పిలువబడుతున్న రియా దేవతకు నివాళి అర్పించే నేపథ్యంలో ఈ ఉత్సవాన్ని మొదటిసారిగా గ్రీస్ దేశంలో నిర్వహించారు.

## అమ్మే ఆదర్శం

**డా సిద్ధార్థ ప్రజావైద్యశాల వనపర్తి**

చిన్నతనం నుంచి అమ్మ సేవలను చూస్తూ, డాక్టర్ కావాలని సంకల్పంతో డాక్టర్‌ను అయ్యి రోగులకు సేవలు అందిస్తున్నా. మదర్స్ డే సందర్భంగా డాక్టర్లందరికీ మిత్రులకు శుభాకాంక్షలు. రోగులతో స్నేహభావంతో, మంచి మాటలతో చికిత్సలు అందించాలని అమ్మను చూస్తూ నేర్చుకున్నాను. సమాజంలో ఎలా మెలగాలో అమ్మే నేర్పారు. నాకూ అమ్మే మొదటి గురువు. మదర్స్ డే సందర్భంగా అమ్మ యొక్క గొప్పతనం చెప్పిన డా సిద్ధార్థ

**– డాక్టర్ సిద్ధార్థ (ప్రజా వైద్యశాల), వనపర్తి**



## మా అమ్మే మాకు అన్నీ..

మాది మహబూబ్‌నగర్. మా అమ్మంటే మాకు సర్వస్వం. చాలా ఇష్టం. మాకు ఒక ఫ్రెండ్. గైడ్‌లా కూడా ఉంటుంది. మంచి చెడులను చెబుతుంది. ఇటీవలే మా నాన్నగారు తనువు చాలించారు. అప్పటి నుంచి అన్నీ తానై కుటుంబాన్ని పోషిస్తున్నది. మాకు మా అమ్మే ధైర్యం. నాన్న లేని లోటు ఒక అమ్మ తప్ప ఎవరు తీర్చలేరు.

**– శిరీష, హారిక, మహబూబ్‌నగర్**

దేశానికి సైనికులను అందించిన

## మాతృమూర్తికి సలాం



**వెల్దండ, మే 10 ప్రభాతవార్త:** కన్న కొడుకులను అల్లారు ముద్దుగా పెంచుకొని ఉన్నత చదువులు చదివించి తన కొడుకుల ఇద్దరినీ దేశ సైనికులగా తయారు చేసి మాతృదేశానికి సేవలందిస్తున్న మాతృ దినోత్సవం సందర్భంగా మాతృమూర్తి ధ్యాప వెంకటమ్మకు సలాం చెబుతున్నారు వెల్దండవాసులు. వెల్దండకు చెందిన ధ్యాప యాదయ్య సాగర్ వెంకటమ్మలు ఇద్దరు కొడుకులను చిన్నప్పటినుండి ఎంతో క్రమశిక్షణతో పెంచి కొడుకులు సైన్యంలో చేరుతామంటే వారిని వెన్నుతట్టి ప్రోత్సహించి వారి పెద్ద కుమారుడు ధ్యాప విజయ్ గత 10 సంవత్సరాల కింద ఆర్మీలో చేరి ప్రస్తుతం జమ్మూ కాశ్మీరులో విధులు నిర్వర్తిస్తున్నాడు. వారి చిన్న కుమారుడు ధ్యాప శ్రీకాంత్ కొన్ని సంవత్సరాలుగా సిఆర్పిలో విధులు నిర్వర్తిస్తున్నాడు. మాతృ దినోత్సవ సందర్భంగా మాతృమూర్తికి ప్రత్యేక వందనాలు తెలుపుతున్నారు.

## ఉదండాపూర్ నిర్వాసితులకు శుభవార్త



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- పరిహారం పెంపునకు సీఎం సానుకూలం
- ప్రతిపాదనలకు త్వరలోనే ఆమోదం
- కాలువల నిర్మాణానికి కూడా టెండర్లు పిలవాలి
- జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి వెల్లడి

**జడ్చర్ల, మే 10 ప్రభాతవార్త:** ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం పెంపునకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని, ఉదండాపూర్ నిర్వాసితులు దీనికి సంబంధించిన శుభవార్తను త్వరలోనే ఉంటారని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని జలసౌదాలో శనివారం జరిగిన ఉదండాపూర్ ప్రాజెక్ట్ నిర్వాసితుల పరిహారం పెంపు సమీక్షా సమావేశంలో అనిరుద్ రెడ్డి నిర్వాసితుల సమస్యలను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని పెంచడానికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగానే ఉన్నారని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రస్తుతం ఆర్థిక శాఖ పరిశీలనలో ఉన్నాయని త్వరలోనే వాటిని ఆమోదించడం జరుగుతుందని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు అనిరుధ్ రెడ్డి తెలిపారు. అలాగే ప్రస్తుతం నిర్వాసితులకు సంబంధించి రూ.40 కోట్లు చెల్లింపులు పెండింగ్ ఉన్నాయని, వాటిని వీలైనంత త్వరగా విడుదల చేయాలని కోరినట్లు తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణ పనులతో పాటుగా నీటి కాలువల నిర్మాణ పనులను కూడా వెంటనే చేపట్టాలని దీనికి సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేసిపనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని కోరినట్లు చెప్పారు. అలాగే కోడ్గల్, బైరంపల్లి, వాడియాల లో చెక్ డ్యాం ల నిర్మాణాలను కూడా చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రి ఉత్తంకుమార్ రెడ్డితో పాటుగా నీటి పారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, ఈఎన్‌సి అరుణ్ కుమార్, వినయ్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ టు మోతిఘనపూర్



- దర్జాగా గంజాయి సరఫరా
- పక్క సమాచారంతో పోలీసుల దాడులు
- అరెస్టు చేసి కేసు నమోదు

నిందితులతో సిఐ విప్లవరెడ్డి, ఎక్సైజ్ ఎస్సై, సిబ్బంది

**బాలానగర్, మే10 ప్రభాతవార్త:** రాజస్థాన్ నుండి వలస వచ్చిన ధన్‌రాజ్ (38) అనే వ్యక్తి గంజాయిని విక్రయిస్తూ పట్టుబడిన సంఘటన బాలానగర్ మండలంలోని మోతీఘనపూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ విప్లవరెడ్డి వివరాల ప్రకారం.. మోతీఘనపూర్ గ్రామంలో గంజాయిని విక్రయిస్తున్నారని స్థానికుల నుంచి సమాచారంరావడంతో, సీఐ ఆదేశాల మేరకు, ఎక్సైజ్ ఎస్సై నాగరాజు సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. పోలీసుల నిర్వహించిన తనిఖీలలో భాగంగా ధన్‌రాజ్ ఇంటిలో 760 గ్రాముల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, గంజాయి రవాణాకు ఉపయోగించిన హోండా యాక్టివను ఎక్సైజ్ శాఖ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాదు నుండి బిర్జు సింగ్(43) కొనుగోలు చేసి, ధన్‌రాజుకు విక్రయిస్తాడు. ధనరాజ్ బాలానగర్ మండలంలోని వివిధ కంపెనీలలో పని చేసే పక్క రాష్ట్రాల కార్మికులకు గంజాయి అమ్ముతున్నట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి, సెల్‌ఫోన్లు, యాక్టివ విలువ దాదాపు రూ.1,20,000 ఉంటుందని, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ విప్లవ రెడ్డి మాట్లాడుతూ గంజాయి అమ్మినా కొనుగోలు చేసిన ఇలాంటి కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరికైనా సమాచారం తెలిస్తేపోలీస్ శాఖకు సమాచారం ఇవ్వాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయిపై సర్కారు ఉక్కుపాదం మోపుతుందని, గంజాయి తదితర మత్తు పదార్థాలను ప్రోత్సహించే వారిపై కూడా చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ట్రావెల్స్ బస్సు ఢీకొని ఇద్దరు మృతి

- ఒకరికి తీవ్రగాయాలు
- భూత్పూర్‌కు సమీపంలో జాతీయ రహదారిపై ఘటన



ప్రమాదంలో మృతి చెందిన వీరమణి, ప్రవీణ్‌కుమార్‌ల మృతదేహాలు

**భూత్పూర్, మే 10, ప్రభాతవార్త:** ట్రావెల్స్ బస్సు ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఇరువురు అక్కడి కక్కడే మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలైన విషాదకర సంఘటన శనివారం తెల్లవారు జామున భూత్పూర్ పట్టణ కేంద్రానికి సమీపంలోని శేర్పలి(బి) అంబటి పల్లి శివారులో జాతీయ రహదారి-44పై చోటుచేసుకుంది. పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ కథనం ప్రకారం కడప నుంచి హైద్రాబాద్‌కు వెళ్లున్న ఏఎస్02 ఈసీ 0954 నెంబరు గల శివదర్శిని ట్రావెల్స్ బస్సు అంబటి పల్లి స్టేజి వద్ద సాంకేతిక లోపంతో ఆగిపోగా, చేసేది లేక ఇదే ట్రావెల్స్‌లో డ్రైవరుగా పనిచేస్తున్న కడప జిల్లా బద్వేల్ మండలం వీరపల్లికి చెందిన కాసుల శ్రీహర్ష సమాచారం ఇచ్చారు. అయితే శ్రీహర్ష భూత్పూర్ మండలం పోతులమడుగులో నివాసముంటున్న మహబూబ్‌నగర్ జిల్లా దొడ్డలోన్‌పల్లి కోయనగర్‌కు చెందిన మృతురాలు సిరిగిరి వీరమణి(38)తో గడిచిన ఎనిమిదేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు, వీరిద్దరికి గంగోత్రి అనే రెండేళ్ల పాప కూడా ఉంది. వీరమణికి ఇదివరకే 20ఏళ్ల క్రితం దొడ్డలోన్‌పల్లికి చెందిన లక్ష్మణ్‌తో వివాహమైంది. వీరికి అరుణ(18), మహేశ్వరి(14) కుమార్తెలున్నారు. సంసార గొడవల వల్ల ఎనిదేళ్ల క్రితం భర్త లక్ష్మణ్‌తో గొడవపడి ఇద్దరు కూతుళ్లను తీసుకునిఇంటికి బయటకు వచ్చి పోతులమడుగులో నివాసముంటుండేది. ప్రవీణ్ కుమార్‌తో పరిచయమేర్పడి ఇరువురు సహజీవనం చేస్తున్నారు. వీరికి రెండేళ్ల పాప ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నా, శనివారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో తాను సహజీవనం చేసే కాసుల శ్రీహర్ష నుంచి తమ ట్రావెల్స్ బస్సు భూత్పూర్‌కు సమీపంలోజాతీయ రహదారిపై ఆగిపోయిందని, ఎవరినైన తీసుకుని బస్సును ఎలాగైనా భూత్పూర్‌కు తీసుకువచ్చే ప్రయత్నం చేయాలని ఫోన్‌ద్వారా తెలుపగా, సిరిగిరి వీరమణి (మృతురాలు) పోతుల మడుగు గ్రామానికి చెందిన శివకుమార్‌గౌడ్ అనే ట్రాక్టర్ డ్రైవర్‌కు మాట్లాడి, ఇద్దరు కలిసి ట్రాక్టర్‌ను తీసుకుని శేర్పల్లి-అంబడిపల్లి స్టేజి వద్ద -మిగతా3లో..

## పైలెట్ ప్రాజెక్టుగా అచ్చంపేట నియోజకవర్గం

- అమ్రాబాద్ మండలంలోని మన్ననూరులో ప్రవేశపెట్టనున్న ఇందిరా సౌర గిరి జల వికాస పథకం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే10 ప్రభాతవార్త:** గిరిజన ప్రజల అభివృద్ధికి ఇందిరా సౌర గిరి జల వికాస పథకం ద్వారా 12,600 కోట్ల రూపాయలతో 6 లక్షల ఎకరాల పోడు భూములకు పథకం వర్తిస్తుందని, 2.10 లక్షల చెంచు, గిరిజన రైతులకు మేలు చేకూరుతుందని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మన్ననూర్‌లో ఈ నెల 18న సీఎం రేవంత్‌రెడ్డిచే పథకం ప్రారంభిస్తున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలంలోని జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో ఉద్యానవన శాఖ, భూగర్భ జల శాఖ, ఐటిడిఏ, డిటిడిఓ అధికారులతో, జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్ గోపిడి, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణలతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఇందిరా సౌరగిరి జల వికాసం పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. గిరిజన ప్రజలవ్యవసాయ భూములకు నీటి సౌకర్యంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించి వారి భూములలో ఉద్యాన పంటలు సాగు చేసే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. ఆర్ఓఎఫ్ఆర్ పట్టా ఉన్న పోడు భూములు వర్షాధారం ద్వారానే సాగు చేస్తుండడం వలన గిరిజనులు అభివృద్ధికి నోచుకోవడం లేదని, ప్రభుత్వం అట్టి పోడుభూములకు నీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో బోరు బావులను త్రవ్వించి, సౌర విద్యుత్ సౌకర్యం కల్పించి, ఉద్యాన పంటలు సాగు చేసే విధంగా డ్రిప్ సిస్టమ్ ఏర్పాటు వంటి పనులను ఈ పథకం ద్వారా గిరిజన రైతాంగానికి మేలు చేస్తాయని వివరించారు. తక్షణమే భూగర్భ జల అధికారులు తమ బృందాలతో గ్రౌండ్ వాటర్ సర్వే నిర్వహించి బోర్ బావులను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు రైతులకు కావలసిన పండ్ల మొక్కలు, డ్రాగన్ ఫ్రూట్, అవగాడ్రో, నిమ్మ, మామిడి వెదురు మొక్కలను సిద్ధం చేసుకోవాలని, డ్రిప్ పైపులను, స్పింకర్లను సరిపడినన్ని అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. అనంతరం మన్ననూరులోని ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో హెలిపాడ్ స్థలాన్ని జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, డీఎఫ్ఓ రోహిత్ గోపిడి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణతో కలిసి పరిశీలించారు. మన్ననూరులో పైలెట్ ప్రాజెక్టుగా ఇందిరా సౌర గిరి జల వికాస పథకం ఈ నెల 18 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు, అందుకు చర్యలను యుద్ధ ప్రాతిపదికన 24 గంటల పాటు సంబంధిత శాఖల బృందాలు పూర్తిస్థాయిలో సమన్వయంతో పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం నాగర్‌కర్నూల్‌జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండలంలోని మాచారం గ్రామంలోనీ పోడు భూములను డీఎఫ్ఓ రోహిత్ గోపిడి, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణలతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, పోడు భూముల ను పరిశీలించారు. భూగర్భ శాఖ అధికారులు బోర్ వేయడానికి గల ప్రాంతాలను గుర్తించే పనులు చేపట్టగా కలెక్టర్ పరిశీలించారు. మాచారం లో ముఖ్య మంత్రి సభ నిర్వహించడానికి గల ప్రాంతాలను జిల్లా ఎస్పీ, డిఎఫ్ఓ లతో పరిశీలించారు. ఈ సమీక్షా సమావేశంలో అచ్చంపేట ఆర్‌డిఓ మాధవి, గ్రౌండ్ వాటర్ ఎడి దివ్య జ్యోతి, డిటిడిఓ ఫిరంగి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు వెంకటేశం, జగన్, డిఆర్డిఏ పిడి చిన్న ఓబులేసు, మిషన్ భగీరథ డీఈఈ హేమలత, అధికారి జాఫర్, ఆర్‌అండ్‌బిడిఈ జలంధర్, అమ్రాబాద్ తహసిల్దార్ శైలేంద్ర, ఎంపీడీఓ, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

- ఇంకుడు గుంతలు, క్యాటిల్‌షెడ్లు, డ్రేనేజీ నిర్మాణాలు సత్వరం చేపట్టాలి
- డబుల్ బెడ్ అర్హులకు ఎలాంటి ధోకా లేదు
- భూత్పూర్ ఎంపీడీఓ ఆఫీస్‌లో ఎమ్మెల్యే జీఎంఆర్



ఎంపీఓ, ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్, మే 10, ప్రభాతవార్త :** ఉపాధి హామీ పనులను వీలైనన్ని అధిక సంఖ్యలో చేపట్టి పనుల్ని వేగవంతం చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) అన్నారు. శనివారం ఎమ్మెల్యే జీఎంఆర్ భూత్పూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎంపీఓలు గ్రామాల్లో ఉపాధి హామి పనులపై దృష్టిని సారించాలనిసూచించారు. గ్రామాలో సన్న, చిన్నకారు రైతులకు ఇంకుడుగుంతలు, గొర్రెలు, పశువుల షెడ్ల(క్యాటిల్ షెడ్స్)నిర్మాణాలు అధికంగా చేపట్టి రైతులకు ఉపయుక్తమైన పనుల్ని ఉపాధిహామిలో చేపట్టాలనిసూచించారు. గ్రామాల్లో మురుగుకాల్వల(డ్రైనేజీ)లనిర్మాణాలు చేపట్టి ప్రజలఆరోగ్యంపై శ్రద్దవహించాలని అన్నారు. ఉపాధి హామి పనుల్లో 40శాతం నిధులు నిర్మాణాలు, 60శాతం నిధులు ఉపాధి కూలీల వ్యయానికివినియోగపడేలా చర్యలుతీసుకోవాలని సూచించారు.

**డబుల్ బెడ్ రూం అర్హులకు ఎలాంటి ధోకా లేదు :** తమ ప్రభుత్వం ప్రభుత్వ పథకాలు అర్హులైనవారికే చెందాలని, వారే అభ్దిపొందాలనే కృతనిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, అర్హులైనవారికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం చేశారు. ఎంపీఓల సమావేశం అనంతరం ఎమ్మెల్యే మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. గత ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ బెడ్ ఇళ్ల లబ్ధిదారులకు నోటసులు జారీ చేసి వారిని ఇబ్బంధులకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తీసుకెళ్లగా, స్పందించిన ఎమ్మెల్యే జీఎంఆర్ అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్ ఇళ్లు ఎట్టి పరిస్థితుల్లో తిరిగి వాపసు తీసుకునే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. ప్రత్యేకించి సిద్దయ్యపల్లి డబుల్ బెడ్ ఇళ్ల కేటాయింపులో కొన్ని అవకతవకలు జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, స్థానికేతరులు, ఆస్తిపరులకు గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసి కేటాయింపులు చేశారని, వాస్తవమైన, అర్హులైన వారికి, ఇళ్లులేని వారికి డబుల్ బెడ్ ఇళ్లు కేటాయించలేదని ఎమ్మెల్యే జీఎంఆర్ స్పష్టం చేశారు. వాస్తవానికి 288డబుల్ బెడ్ ఇళ్లలో దాదాపుగా 83మంది లబ్ధిదారులు డబుల్ బెడ్ ఇళ్లకు అర్హులు కారని తమ దృష్టికి వచ్చిందని, అలాంటి అర్హతలేనివారిని వాస్తువానికి అరుహలైన వారికి ఇళ్లు కేటాయించే చర్యలు మొదలయ్యాయని అన్నారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ విజయేంద్రబోయి కృతనిశ్చయంతో ఉన్నారని, అందుకు తగ్గ చర్యలు చేపట్టారని అన్నారు. ఎమ్మెల్యే వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కినవీన్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌కుమార్‌గౌడ్‌తో పాటు నాయకులు హరియా నాయక్, లాలూ నాయక్, మశ్చేందర్, రాంరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, టీవీ రెడ్డి, వెంకటేష్, ఆగిరి రవి తదితరులు ఉన్నారు.

సెలవులు రద్దు చేసుకొని దేశ రక్షణకు..

## కాశ్మీర్‌కు బయలుదేరిన జవాన్లు

- సన్మానం చేసి సగౌరవంగా పంపిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు
- ఉమ్మడి జిల్లాలో భరతమాత సేవలో వేలాదిమంది సైనికులు



జవాన్ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఆయన సతీమణి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఉప్పునుంతల, మే 10 ప్రభాతవార్త:** నెలల తరబడి ఆర్మీలో జవాన్లుగా వివిధ హోదాల్లో పనిచేసిన వందలాది మంది సైనికులు ఏడాదికి ఒక్కసారి కుటుంబ సభ్యులతో గడపడానికి సెలవుల్లో స్వగ్రామాలకు వచ్చారు. పహల్గాంలో సంఘటన అనంతరం భారతదేశం ఉగ్రవాదం పై తిప్పి కొట్టిన చర్యల్లో భాగంగా సైనికులందరూ విధులకు హాజరు కావాలని సమాచారం అందడంతో ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా వెనక ముందు చూడకుండా భరతమాత సేవలో దేశ రక్షణకై నడుం బిగించి వందలాదిగా బార్డర్‌కి తరలారు. కుటుంబ సభ్యులు గ్రామస్తులు సైతం సగౌరవంగా సన్మానం చేసి వీర తిలకం దిద్ది ఉగ్రవాదులను మట్టుపెట్టి దేశాన్ని రక్షించాలంటూ సాగనంపారు. భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ లో భాగంగా భారతదేశ రక్షణకై భారత ప్రభుత్వం పిలుపు మేరకు సెలవును రద్దు చేసుకొని దేశ సేవకై బయలుదేరారు. బల్మూరు గ్రామనివాసి అచ్చంపేటకు చెందిన వట్టెపు శ్రీనివాసులు జమ్ము కాశ్మీర్లోని వారముల జిల్లాలో సీఆర్పీఎఫ్ జవాన్‌గా పని చేస్తున్నారు. శ్రీనివాసులు సతీమణి కళావతమ్మ దేశాభిమానులైన పూలే ట్రస్ట్ ఫౌండర్ పచ్చిపాల సుబ్బయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా ఉద్యోగ సంఘ కార్యవర్గం నెంబర్ ఉపాధ్యాయులు కొండమోని సుధాకర్, నాగర్ కర్నూల్ జిల్లా నాయి బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షులు కానుగుల శ్రీనివాసులు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కమిటీ మెంబర్ రాచమల్ల వెంకటేష్‌కలిసి శ్రీనివాస్‌ను సన్మానించి సాగనంపారు. యుద్ధంలోపాల్గొని విజయం సాధించాలని వీర తిలకం దిద్దారు.

## ధాన్యం కొనుగోలు చేయండి మహా ప్రభో..

**చిన్నంబావి, మే10 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెలగొండ గ్రామంలో గత కొన్ని రోజులుగా రైతుల వరి ధాన్యము కొనుగోలు చేయనందుకు నిరసిస్తూ వెలుగొండ గ్రామ నడిరోడ్డుపై రైతుల వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం. ఆంజనేయులు, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మలు రైతులు నిర్వహించిన ధర్నాకు మద్దతు తెలుపుతూ వరి ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని, తక్షణమే తహసిల్దార్ లేదా జాయింట్ కలెక్టర్ ధర్నా దగ్గరికి వచ్చి హామీ ఇవ్వాలని డిమాండ్ చేయడం జరిగింది. మండల ఎస్సై జగన్మోహన్ ధర్నా దగ్గరికి విచ్చేసి జిల్లా రెవెన్యూ జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుతో -3లో..



ధర్నా నిర్వహిస్తున్న రైతులు

## ప్రతి ధాన్యపు గింజలను కొంటాం : అదనపు కలెక్టర్



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు

**వీపనగండ్ల ,మే 10 ప్రభాతవార్త:** రైతులు మార్కెట్కు తీసుకువచ్చిన వరి ధాన్యాన్ని ప్రతి గింజలు కొంటామని రెవెన్యూ అదనపు కలెక్టర్ జి వెంకటేశ్వర్లు తెలిపారు శనివారం నాడు మండలంలోని కల్వరాల తూముకుంట వెలగొండ వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు ఎవరు అధైర్య పడవద్దు అని వారం రోజుల్లో ప్రతి ధాన్యపు గింజలు కొనుగోలు చేసి పూర్తి చేస్తామని ఆయన తెలిపారు అదేవిధంగా రైతులు వరి ధాన్యంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించొద్దని తాలు. గడ్డి. మట్టి .లేకుండా కల్లాలకు తీసుకురావాలని ఆయన సూచించారు దానితోపాటు తెమ.శాతం కూడా సరిగ్గా చూసుకోవాలని ఆయన రైతులకు సూచించారు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక లారీ పెట్టాలని ట్రాన్స్పోర్టు కాంట్రాక్టర్లను ఆదేశించినట్లు ఆయన తెలిపారు రైతులకు ఎలాంటి ఇబ్బంది కల్లాలలో కలగకుండా చూసే బాధ్యత కొనుగోలు అధికారులదని ఆయన ఈ సందర్భంగా తెలిపారు ఆయనతో రైతులు వారి సమస్యలను తెలియజేశారు.

## లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**గద్వాల ప్రతినిధి, మే10,ప్రభాతవార్త:** తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ (తాలిమ్) నుండి లైసెన్స్ సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అర్హులైనఅభ్యర్థులు తెలంగాణలోని అన్ని మీ సేవ కేంద్రాలలో.. లైసెన్స్ సర్వే శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తు చేయవచ్చని, ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో మొత్తం 50 పని దినాలు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.అభ్యర్థుల అర్హతలు ఇంటర్మీడియట్ (గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండాలి,కనీసం60మార్కులతో ఐటీఐ డ్రాఫ్ట్స్ మెన్ (సివిల్) డిప్లొమా,సివిల్ బి.టెక్,సివిల్ లేదా ఇతర సమానమైన అర్హ తదరఖాస్తు విధానం దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్ను 2025 మే5 నుండి మే17 వరకు మీసేవా కేంద్రాలద్వారా మాత్రమే రూ.100/ చెల్లించి పొంద‌వచ్చు. దరఖాస్తుల సమర్పణకు చివరితేదీ: 17.05.2025 (మీసేవ కేంద్రాల్లో మాత్రమే ఓ.సి. అభ్యర్థులకు రూ.10,000/బి.సి.అభ్యర్థులకు రూ.5,000/ ఎస్.సి./ఎస్.టి.అభ్యర్థులకు రూ.2,500/ లైసెన్స్ కలిగిన సర్వేయర్లుగా మారేందుకు ఇదొక సువర్ణ అవకాశమని. అర్హత కలిగినటువంటి అభ్యర్థులు, తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మానేజ్మెంట్ నుండి విడుదల అయినటువంటి ఈ నోటిఫికేషన్ని సద్వినియోగ పరుచుకోవాలని అట్టి ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు.

## జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణ మల్లికకు ఘన సన్మానం



స్వర్ణ మల్లికకు పుష్పగుచ్చం అందజేస్తున్న నాయకులు

**మానవపాడు, మే10 ప్రభాతవార్త:** ఇటీవలే వెలువడిగా జడ్జి నియామక ఫలితాలలో గట్టు మండలం కేంద్రానికి చెందిన స్వర్ణ మల్లిక ఉత్తమ ప్రతిభ కనబరిచి జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైంది.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, బీసీ సంఘం జిల్లా నాయకులు బిఆర్ఎస్ పార్టీ నేత పచ్చర్ల శ్రీనివాసులు జూనియర్ సివిల్ జడ్జి స్వర్ణ మల్లికను కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువా పూలమాలలతో సత్కరించి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోగులాంబ గద్వాల జిల్లాలోనే మొట్టమొదటిసారిగా జడ్జిగా స్వర్ణ మల్లికా ఎంపిక కావడం జిల్లాకే గర్వకారణమన్నారు. ఇలాగే భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. అయితే ఈమె తండ్రి గట్టు సురేష్ జిల్లా కేంద్రంలో కోర్టులో అడ్వకేటుగా విధులునిర్వహిస్తున్నారని చిన్నప్పటి నుంచి సుపరిచితమైన వ్యక్తిని వారు కొనియాడారు. అనంతరం ఆమె తండ్రి గట్టు సురేష్ మాట్లాడుతూ మా కూతురు స్వర్ణ మల్లికకు చిన్నప్పటి నుంచి జడ్జి కావాలనే లక్ష్యం ఉండేదని ఆ క్రమంలో ఆమె నిరంతరం క్రమశిక్షణ పట్టుదల, కృషితో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించిందని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాషా, పరశ్ బాబు, సత్యనారాయణ, అంతంపల్లి భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

## వీరమరణం పొందిన అమరులకు ఘన నివాళులు



మురళి నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కోయిలకొండ, మే10 ప్రభాతవార్త:** ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన అమర జవాన్లకు మండల కేంద్రమైన కోయిలకొండలోని హిందూ యువజన బృందం నేతలు ఘన నివాళులు అర్పించారు. శత్రుదేశంపై విజయం కొరకుశనివారం నాడు కోయిలకొండ లోని ఆది ఆంజనేయ స్వామి దేవాలయంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం గావించి అక్కడి నుంచి హిందూ యువజన బృందం నేతలు భారీ ర్యాలీ నిర్వహిస్తూ పాకిస్తాన్ డౌన్ అంటూ స్వామి వివేకానంద చౌరస్తా ప్రాంత వరకు ర్యాలీ చేరుకొంది. అక్కడ ఆపరేషన్ సింధూర్ లో దేశం కోసం వీరమరణం పొందిన మురళి నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు .ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న యుద్ధ వాతావరణంలో శత్రు దేశమైన పాకిస్తాన్‌పై భారతదేశం విజయం సాధించా లని, మన దేశ సైనికులు సురక్షితంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.ఆపరేషన్ సింధూరంలో పాకిస్తాన్ చిత్తుగాఓటమి చవి చూడాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బి.కృష్ణ, నాయకులు పార్థసారథి, రాములు గౌడ్, పాండు,లక్ష్మీనారాయణగౌడ్,రామస్వామి, మోహన్ రంగయ్య, శ్రీనివాసులు, బి.వెంకటనారాయణ, రాఘవేందర్, రిటైర్డ్ ఆర్మీ జవాన్ సత్యనారాయణ, తిరుపతి గౌడ్, రాజేష్, రాజు, అప్పి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నంది వడ్డేమాన్‌లో శని త్రయోదశి పూజలు

◆ శనైశ్చరస్వామికి తిల, తైలాభిషేక పూజలు

**బిజినేపల్లి, మే10 ప్రభాతవార్త:** శని త్రయోదశి పురస్కరించుకొని నంది వడ్డేమాన్‌లో శనేశ్వర స్వామికి వైభవంగా శని త్రయోదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు డా. గవ్వ మఠం విశ్వనాథ శాస్త్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు ప్రతి మాసంలో శని వారం నాడు అష్టమి,నవమి, త్రయోదశి చతుర్దశి,అమావాస్య తిథులు ఉన్న రోజు శనేశ్వర స్వామికి ప్రత్యేకంగా పూజించి అభిషేకించిన విశేష పుణ్యఫలితం దక్కుతుందని అన్నారు. మీనరాశి నుండి మేషరాశి వరకు గల వారికి జన్మరీత్యా గోచార రీత్యా ఉన్న సంచారంలో శని గ్రహదోష పరిహార నిమిత్తం శనీశ్వర స్వామికి శక్తి కొలది తిల తైల అభిషేక పూజలు,అష్టోత్తర పూజలు,స్వామివారిని దర్శించుకోవడం, ఆరాధించడం,నామం జపించడం విశేష ఫలితం ఉంటుందని వివరించారు. శని త్రయోదశి సందర్భంగా భక్తులు, పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయఆలయ కమిటీ సభ్యులు కేంచే రాజేష్, ప్రభాకర్,పుల్లయ్య,వీర శేఖర్, శ్రీకాంత్ రెడ్డి,ఆలయ అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు పాల్గొన్నారు.



శనైశ్చరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

## చట్టాల సవరణ పేరుతో ఉపాధి పథకం ఎత్తివేతకు కుట్ర

◆ తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పి ప్రసాద్



జూరాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు ప్రసాద్

**ఆత్మకూర్ మే10,ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం చట్టాల సవరణ పేరుతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసేందుకు పెట్రోల్ పన్నుతోందని తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పి ప్రసాద్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. శనివారం రోజు ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామంలో వ్యవసాయ కూలీలకు సమగ్ర వేతన ఒప్పందాన్ని తక్షణమే అమలు చేయాలంటూ ఉపాధి కూలీలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఇప్పటికే 50 శాతం మేర పని దినాలను తగ్గించడమే కాకుండా కనీస కూలీ చెల్లించే విషయంలో కూలీలకు తీరని అన్యాయం చేస్తుందని ఆయన పేర్కొన్నారు చట్టాల సవరణ పేరుతో నాలుగు లేబర్ కోర్లను నూతనంగా తెచ్చేందుకు ప్రయత్నిస్తుందని తద్వారా కార్మిక యజమానులకు కేంద్ర ప్రభుత్వం విశేష అధికారాలు కల్పించనుందని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న కూలీలకు కనీస వేతనం రోజుకు 600రూపాయలు చెల్లించాలని అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం గత శాసనసభ ఎన్నికల సమయంలో వ్యవసాయ కూలీలకు ఎలాంటి షరతులు లేకుండా 12,000 చెల్లిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినప్పటికీ నేటి వరకు కార్యాచరణ చేపట్టకపోవడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయకుండా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అందులో భాగంగానే ఈనెల 20న చేపట్టినటు వంటి దేశవ్యాప్త కార్మిక సమ్మెకు ప్రతి ఒక్కరూ తమ మద్దతు పలకడమే కాకుండా ర్యాలీలో ధర్నాలు వంటి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండగా ప్రజా ప్రభుత్వం

● నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి

**బిజినేపల్లి, మే10 ప్రభాతవార్త:** పేద ప్రజలకు అండగా పార్టీలక తీతంగా ప్రజా పరిపాలన కొనసాగుతుందని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఆయా గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాది ముబారక్ సిఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకిచ్చిన ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల ప్రభుత్వంగా ముందుకు సాగుతున్నామన్నారు. రెండు లక్షల రుణమాఫీ రైతు భరోసా వంటి ఎన్నో సంక్షేమ పథకాల అమలు చేస్తున్నామన్నారు. అనంతరం రైతాంగానికి సబ్సిడీపై మంజూరైన స్ప్రింక్లర్లను లబ్ధిదారులకు అందించారు. రైతులు సాగునీటి వినియోగాన్ని తగ్గించి బిందు స్ప్రింక్లర్ల సేద్యానికి అలవాటుపడాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడి భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమాల్లో జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మిద్దె రాములు, అమృత్ రెడ్డి, తిరుపతయ్య రాగి మధుసూదన్ రెడ్డి, కత్తె ఈశ్వర్ శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జున్ రెడ్డి, వీరేష్ , రామన్ గౌడ్, నరేందర్ గౌడ్, శ్రీకాంత్, శేఖర్, కృష్ణారెడ్డి గోవింద్ నాయక్, కృష్ణ, రామ్ చందర్ తదిరులు పాల్గొన్నారు.



రైతులకు స్ప్రింక్లర్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

## సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి

◆ మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి

**మక్తల్, మే10 ప్రభాతవార్త:** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు గాను ప్రభుత్వం అందజేస్తున్న సీఎం సహాయనిధి పథకాన్ని సద్వినియోగం చేసుకొని, సంపూర్ణ ఆరోగ్య వంతులుగా మారాలని, మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మక్తల్ మండలంలోని రుద్ర సముద్రం గ్రామానికి చెందిన మలిగేరి లింగమ్మ, జగదీశ్వరి చిన్న కడుమూరు గ్రామానికి చెందిన కల్వ రవిలకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం ఎమ్మెల్యే తన నివాసంలో అందజేశారు. అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆసుపత్రుల్లో శస్త్ర చికిత్సలు చేసుకున్న నిరుపేదలు ఎవరైనా కూడా సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంటే త్వరిత గతినవారికి ఆర్థిక సహాయం అందేలా చూస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మాజీ సర్పంచ్ రామేశ్వర్ రెడ్డి, నాయకులు శంషుద్దీన్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

## క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలి

◆ అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి : వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

◆ ఉమ్మడి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను, ఉత్సవాలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ

**పెబ్బేరు,మే 10 ప్రభాతవార్త:** ఆటలోని గెలుపు ఓటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించి క్రీడల్లో అద్భుతమైన ప్రతిభ కనపర్చాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం రోజు పెబ్బేరు మండలం కంచిరావుపల్లి గ్రామంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్న శ్రీభూ సమేతశ్రీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమం, ఉమ్మడి తెలుగు రాష్ట్ర స్థాయి కబడ్డీ ప్రారంభోత్సవ కార్యక్రమాలు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలకు హాజరైన జిల్లా ఎస్పీని దేవాలయ అర్చకులు సంప్రదాయ బద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారికి పూజా కార్యక్రమం నిర్వహించి ఎస్పీని సన్మానించారు. ఉత్సవాలను ప్రశాంతంగా భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలని ఆయన ప్రజలను కోరారు. సాంప్రదాయ నృత్యాలతో భక్తులను అలరించిన మహిళలను అభినందించి 2 వేల నగదు బహుమతి అందజేశారు.అనంతరం ఉమ్మడి తెలుగు రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న కబడ్డీ పోటీలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి ఇరుజట్ల క్రీడాకారులను కరచాలనం చేసి ప్రోత్సహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏ ఆటలోనైనా గెలుపు ఓటములు సహజమని వాటిని సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు.క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక వికాసం, మనోధైర్యం,దేహదారుఢ్యం పెంచుకోవచ్చని అయితే ఆటల్లో ప్రతి ఆటగాడు తన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కబడ్డీ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించి తెలంగాణ రాష్ట్రానికి వనపర్తి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, వెంకటేశ్వరరెడ్డి, గ్రామమాజీ సర్పంచ్, తేజవర్ధన్, గ్రామస్తులు, గోపాల్, నీలవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, భాస్కర్, శ్యాం సుందర్,రాము, బాలగౌడ్, సోమగౌడ్, రవీందర్, గ్రామ ప్రజలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జిల్లా ఎస్పీ



శ్రీశ్రీ భూ సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎస్పీకి స్వాగతం పలుకుతున్న ఆలయ సిబ్బంది

## డ్రైవర్లు వాహనాల మెకానిజంపై అవగాహన కలిగి ఉండాలి

**నారాయణపేట టౌన్, మే 10 ప్రభాతవార్త :** డ్రైవర్లు వాహనాల మెకానిజంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపిఓ ఆర్ ఎస్సై శివశంకర్ అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు శనివారం నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలోని ట్రైనింగ్ సెంటర్ ఎంపిఓ ఆర్ ఎస్సై శివ శంకర్ ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీస్ మోటార్ వాహన డ్రైవర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆర్ ఎస్సై శివశంకర్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ స్టేషన్లలో పెట్రోల్ కార్ విధులు నిర్వర్తించే వాహన డ్రైవర్లు పెట్రోలింగ్ వాహనాన్ని నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తూ ఉండాలని రాత్రి పెట్రోలింగ్ చేసే సమయంలో తమకు కేటాయించిన పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్విరామంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ నేరస్తులపై నిఘా ఏర్పాటు చేయాలని, ముందస్తు నేరాలు జరగకుండా చూడాలని సైరన్‌వేసుకుంటూ పెట్రోలింగ్ నిర్వహించాలని తెలిపారు. వాహనాలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్‌చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వాహనాల మెకానిజం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌పరిధిలో విధులు నిర్వర్తించే సమయంలో అప్రమత్తం గా ఉండి తమకు కేటాయించిన వాహనాన్ని ప్రతిరోజు శుభ్రపరుస్తూ కండిషన్ లో ఉంచుకోవాలని సమయానికి ఆయిల్ సర్వీసింగ్ చేయించుకోవాలని సూచించారు. ఎమర్జెన్సీ సమయంలో పై అధికారులకు వాహనాన్ని అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. వాహనాన్ని నడిపించే సమయంలో ప్రతి ఒక్కరూ నీట్ టర్నవుట్ యూనిఫామ్ కలిగి ఉండాలని, డ్రైవింగ్ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండి సైన్ బోర్డ్స్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మత్తుపదార్థాలు సేవించి వాహనాన్ని నడపరాదని హెచ్చరించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ఉన్న మోటార్ వాహనాల యొక్క మెకానిజంపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోని పోలీసు మోటార్ వాహన డ్రైవర్లు, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్సై

## మోపా మండల సన్నాహక సమావేశం

**ధన్వాడ, మే 10 ప్రభాతవార్త :** మోపా నారాయణపేట జిల్లా" ఆధ్వర్యంలో"పదవ తరగతి, ఇంటర్ మెరిట్ విద్యార్థులకు,వివిధ రంగాల్లోని ఉత్తమ ఉద్యోగులకు" ముదిరాజ్ పెద్దల సమక్షంలో నిర్వహించే మోపా అభినందన సభకు సన్నాహక సమావేశం ధన్వాడ మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘందగ్గర నేడు (ఆదివారం) నాడు ఉదయం ఎనిమిది గం.లకు ఉంటుంది. కనుక మండలంలోని ముదిరాజ్ పెద్దలు ఉద్యోగులు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని నీరటి నరసింహనాయుడు ముదిరాజ్ నారాయణ పేట్ జిల్లా మత్స్య పరిశ్రమిక సహకార సంఘం ఉపాధ్యక్షులు కోరారు.

## ముగిసిన జిల్లా నెట్ బాల్ జట్ల ఎంపిక



నెట్‌బాల్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, మే10 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా సబ్ జూనియర్ 16 సంవత్సరాలలోపు బాల బాలికల జట్ల ఎంపికలు నెట్‌బాల్ సంఘం తెలంగాణ అధ్యక్ష కార్యదర్శులు విక్రమాదిత్యరెడ్డి, శిరీష రాణిగౌడ్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర క్రీడా ప్రాంగణంలో జట్ల ఎంపికను నిర్వహించినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డా. రామ్మోహన్ గౌడ్, అంజద్ అలీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలల క్రీడాప్రాంగణంలో 16 సంవత్సరాలలోపు బాల బాలికల జట్లు ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఎంపికలు వివిధ మండలాల నుండి 40మంది బాలురు, 24 మంది బాలికలు పాల్గొన్నారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15 నుండి 18 వరకు జనగామ జిల్లాలో జరిగే 8వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లోనారాయణపేట జిల్లా నుండి ప్రతినిత్యం వహిస్తారన్నారు. ఈ ఎంపికలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శెట్టి వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కెంచ. నరేందర్, పిడిలు తిరుమలేష్, రాజేష్ గౌడ్, పిఈటి రవికుమార్ గౌడ్‌తో బాటు తదితరులు పాల్గొన్నారు.

## నేడు పేటలో విద్యుత్ అంతరాయం

**నారాయణపేట టౌన్, మే 10 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోఆదివారం ఉదయం 9 గం.ల నుండి 11 గం.ల వరకు నారాయణపేట పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు స్థానిక ఏఈ మహేష్ గౌడ్ తెలిపారు. 33/11కే.వి ఉప విద్యుత్ కేంద్రంలో పునరుద్ధరణ పనులు కొనసాగుతున్న సందర్భంగా రెండు గంటలు పట్టణ ప్రజలకు , గ్రామీణ ప్రాంతాల విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు. కావున వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఏఈ కోరారు.

## భక్తితో శనిత్రయోదశి పూజలు

**నారాయణపేట టౌన్, మే 10 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణంలోని శనిశ్వర స్వామిదేవాలయం వద్ద శనివారం శని త్రయోదశి సందర్భంగా భక్తులతో కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి నల్ల వస్త్రాలు సమర్పించి తైలాభిషేకం పుష్పాలంకరణ ప్రత్యేక పూజలతోపాటు మహామంగళ హారతి, సర్వదర్శనం అనంతరం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. పట్టణ పరిసర ప్రాంత ప్రజలు మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. వేడుకల్లో భక్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం మక్తల్ ప్రధాన కార్యదర్శి భాస్కర్

**మక్తల్, మే 10 ప్రభాతవార్త:** విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి వారిని అన్ని విధాలుగా ఆదుకో వాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మక్తల్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. మక్తల్ పట్టణంలో శనివారం విశ్రాంత ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లకు ప్రభుత్వం బకాయి ఉన్న డీఏలను తక్షణమే నగదు రూపంలో అందజేయాలని డిమాండ్ చేశారు. అలాగే కొత్త పిఆర్సిని ప్రకటించి అమలులోకి తీసుకురావాలన్నారు.సకాలంలో వేతనాలు అందక విశ్రాంత ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు సిద్ధి లింగయ్య, సూర్యప్రకాష్, కిష్టయ్య గౌడ్,మల్లికార్జున్, నాగిరెడ్డి, జనార్ధన్, సురేందర్,నారాయణరెడ్డి, రాములు,నరసయ్య, తులసప్ప, సిద్ధిరాములు, తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మీసేవ ఫెడరేషన్ పేట జిల్లా అధ్యక్షులుగా కోయిలకొండ వెంకట్రాంరెడ్డి ఎంపిక



నూతన కమిటిని సన్మానించిన దృశ్యం

**నారాయణపేట టౌన్, మే10 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలోని మీసేవ నిర్వాహకులు శనివారం జిల్లా కేంద్రంలో సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు భైరాశంకర్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ మోహిద్ హాజరయ్యారు. తెలంగాణ మీసేవ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగాఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కోయిలకొండ వెంకట్రాంరెడ్డి, దామరగిద్ద, ఉపాధ్యక్షులుగా కంరోద్దీన్, శంకర్, ప్రధాన కార్యదర్శిగా ఇమ్రాన్ ఖాన్, సంయుక్త కార్యదర్శులుగా కరుణానిధి, బి.రవితోపాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులు వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ మీసేవ నిర్వాహకుల సహకారంతో సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నారు. మీసేవ నిర్వాహకులకు అందుబాటులో ఉండి తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి ముందుంటానన్నారు. మీసేవ నిర్వాహకులు నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతతో నడుచుకుంటానన్నారు.అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మీసేవ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్ట్

-డబ్బుల విషయంలో తగాదా..హత్య -మీడియా సమావేశంలో పోలీస్ సీఐ రామకృష్ణ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

**భూత్పూర్,మే 10,ప్రభాతవార్త :** వారం రోజుల క్రితం భూత్పూర్ మండలం వెల్కిచర్లలో మహిళా హత్య కేసులో భూత్పూర్ పోలీసులు నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి రిమైండ్‌కు తరలించారు.అరెస్ట్ విషయమై సీఐ రామకృష్ణ శనివారం సాయంత్రం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు.వెల్కిచర్ల గ్రామానికి చెందిన కొట్టె పర్వతాలు ఇదే గ్రామానికి చెందిన కొత్తగొల్ల నాగమ్మ(40)తో గత కొంత కాలంగా అక్రమ సంబంధమేర్పరచుకున్నాడు.ఈ క్రమంలో మృతురాలు నాగమ్మతో రు.50వేలు పర్వతాలు తీసుకున్నాడు.ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని సదరు మృతురాలు నాగమ్మ పలుమార్లు పర్వతాలుతో గొడవలకు దిగేది.ఈ క్రమంలో పర్వతాలు నాగమ్మను ఎలాగైనా కడతేర్చాలని నిర్ణయించుకుని తాను తీసుకున్న డబ్బులు తీసుకుని ఇంటికి వస్తున్నానని నాగమ్మతో ఈ నెల 2న రాత్రి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా,నాగమ్మ భోజన ఏర్పాట్లు చేసింది. ఇంటికి రాగాగా డబ్బుల విషయంలో నాగమ్మ పర్వతాలుతో గొడవకు దిగగా,పర్వతాలు తన వెంట తెచ్చుకున్న వేటకొడవలితో నాగమ్మను నరికి చంపివేశాడని సీఐ రామకృష్ణ తెలిపారు.నిందితుడైన పర్వతాలు తనతో నాగమ్మ సఖ్యతతో ఉండడం లేదని,అందుకే విసిగి చంపాపని చెప్పినట్లు సీఐ తెలిపారు.మీడియా సమావేశంలో ఎస్సై చంద్రశేఖర్ ఇతర పోలీసులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన సింగల్ విండో డైరెక్టర్

**వెల్దండ, మే10 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన మారేపల్లి అలివేల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. మృతురాలి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు సిమ్ముల తిరుపతిరెడ్డి, పుట్ట యాదయ్య, గంటల రామకృష్ణ, శ్రీను, లోకేష్, రేవెల్లి రాజు, మహేష్, భరత్, కొండల్, మట్ట భరత్ గౌడ్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు బహుమతులు అందజేత

**పెబ్బేరు, మే 10 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం అయ్యావారిపల్లి గ్రామంలో ఏపీఎల్ వన్ ప్రీమియర్ లీగ్ విజేతలకు శనివారం రోజు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి రూ. 20 వేలు అందజేశారు.రెండవ బహుమతి గౌని బుచ్చారెడ్డి బ్రదర్స్ రూ. 15 వేలు గెలుపొందిన క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌని జస్వంత్ రెడ్డి, గౌని ఓం ప్రకాష్ రెడ్డి, మద్దిలేటి, గుణసాగర్, కురుమూర్తి, మజీద్, తదితర క్రీడాకారులు గ్రామ యువకులు పాల్గొన్నారు.

## సమూచిత స్థానం కల్పిస్తే... ఎమ్మెల్యేపై విమర్శలు చేయడమా!

**వంగూరు, మే 10 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి పనిచేశారనే కృతజ్ఞతతో పార్టీలో సమూచిత స్థానం కల్పించి మంచి పదవులు అప్పగిస్తే ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పై విమర్శలు చేయడం ఆయన విజ్ఞతకే నిదర్శనమని యూత్ కాంగ్రెస్ అసంబ్లీ అధ్యక్షులు క్యామ మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, మైనార్టీ నాయకులు షరీఫ్ ఖాన్, వెంకటయ్యలు అన్నారు.శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలోకార్యకర్తలతో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పండిత్ రావు పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు మీడియా సమావేశంలో చెప్పడమేమిటని వారు ప్రశ్నించారు. ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మిమ్ముల్ని నమ్మి కల్వకుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, టెలికాం స్టేట్ అడ్వైజర్ కమిటీ మెంబర్ గా నియమిస్తే ఎమ్మెల్యేకే పంగనామాలు పెట్టే విధంగా పండిత్‌రావు వ్యవహరించిన తీరు సమంజసం కాదని అన్నారు. దమ్ము ధైర్యం ఉంటే కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా కాదు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి, టెలికాం అడ్వైజర్ కమిటీ మెంబర్‌కు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేసారు. కార్యక్రమంలో యాదగిరి రావు, యాదయ్య,శ్రీశైలం, రమేష్, ఖాయ్యూమ్ తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన క్యామ మల్లయ్య

**వంగూరు, మే 10 ప్రభాతవార్త:** వంగూర్ మండలం ఉమ్మాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు ఆర్కపల్లి రేణుక అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న అచ్చంపేట అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు క్యామ మల్లయ్య శుక్రవారం మృతురాలి నివాసానికి చేరుకొని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆదేశాల మేరకు మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరుపున రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో అంకురి బాలస్వామి, శ్రీశైలం, శ్రీను, భగవంతు, సత్యనారాయణ, వెంకటయ్య, బాలయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు చేయండి మహాప్రభో..

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడి ఐకెపి సెంటర్‌ను తప్పనిసరిగా సందర్శిస్తారని, సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఎస్సై రైతులకు తెలియజేసి ధర్నాను విరమింప చేశారు. అనంతరం ఐకెపి సెంటర్‌కు వనపర్తి రెవెన్యూ జాయింట్ కలెక్టర్ వచ్చి రైతులతో మాట్లాడి రేపటి నుంచి ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని తక్షణమే లారీలతో రైస్ మిల్‌కు పంపిస్తామని, రైతుల వరిధాన్యము కొనుగోలు చేసిన ప్రతి రైతుకు తక్షణమే వరి కొనుగోలు పత్రం ఇవ్వాలని ఐకెపి సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. సమస్యను పరిష్కరిస్తామని రైతులకు హామీ ఇవ్వడంతో రైతులు తమ ఆందోళనను విరమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ జాయింట్ కలెక్టర్ శ్రీవెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆంజనేయులు, చిన్నంబాయి మండల పోలీసులు, గ్రామ రైతులు, ఐకెపి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రావెల్స్ బస్సు ఢీకొని ఇద్దరు మృతి

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ రహదారిపై ఫెయిల్ అయిన ట్రావెల్స్ బస్సు వద్దకు వెళ్లారు.బస్సును ట్రాక్టర్‌కు గట్టి తాడుతో కట్టి అమర రాజా కంపెని ఎదురుగా ఉన్న మలుపు నుంచి భూత్పూర్ వైపుకు మళ్లించి వస్తుండగా,కొంత దూరం వెళ్లాక ట్రావెల్స్ బస్సుకు కట్టిన తాడు తెగిపోవడంతో,మళ్లి తాడును కట్టే ప్రయత్నంలో మృతురాలుసిరిగిరి వీరమణి(38),ట్రావెల్స్ బస్సుక్లీనర్ అనకర్ల ప్రవీణ్ కుమార్(43)తెగిన తాడును సరిచేసే క్రమంలో ట్రాక్టర్ కింద తాడును కడుతుండగా,బస్సును ఆటోమెటిక్‌గా స్టార్ట్‌అయి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ట్రాక్టర్ కింద ఉన్న సిరిగిరి వీరమణి(38),ట్రావెల్స్ బస్సు క్లీనర్ అనకర్ల ప్రవీణ్‌కుమార్(43) ఇరువురి మీదుగా ట్రాక్టర్ దూసుకు వెళ్లగా ఇరువురు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు.మృతుడు అనకర్ల ప్రవీణ్‌కుమార్ అన్నయ్య అనకర్ల ప్రశాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ రామకృష్ణ పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

## పెబ్బేరు పోలీస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ

- వేసవిలో దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలి
- రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి : వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**పెబ్బేరు, మే10 ప్రభాతవార్త :** వేసవిలో పిల్లలకు సెలవులు ఉండటంతో చాలామంది ప్రయాణాలు చేస్తారు ఇదే అదునుగా దొంగలు చేతివాటం చూపిస్తారు. ఊళ్ళకు వెళ్లేవారు ఇంటి బయట నిద్రించేవారు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం వనపర్తి జిల్లా పెబ్బేరు పోలీస్టే షన్‌ను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్టేషన్ పరిసరాలను తనిఖీ చేసి పోలీస్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాలపై వాటి ప్రస్తుత స్థితిగతులపై సిబ్బందిని అడిగి తెలుసు కున్నారు. పోలీస్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించకుండా గట్టిగా గస్తీ నిర్వహిస్తూ ఆరికట్టాలని సూచించారు. పోలీస్టేషన్‌లో నమోదైన కేసుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డుల నిర్వహణ తప్పకుండా నవీకరిస్తూ ఉండాలని, ఎటువంటి పెండెన్సీ లేకుండా రికార్డుల నిర్వహణ చేయాలనే సూచించారు. పోలీస్టే షన్లో రిసెప్షన్ సెంటర్ ను పరిశీలించి బాధితులపట్ల వ్యవహరించే తీరును,ఫిర్యాదులను పరిష్కరించే తీరును పరిశీలించారు.సిబ్బందితో మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులను నిర్వర్తించాలని సూచించారు.ప్రజలతో మమేకమై సత్సంబంధాలను మెరుగుపరుచుకుంటూ,ఎలాంటి రిమార్కులు లేకుండా, ప్రజలలో పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే విధంగా విధులను నిర్వర్తించాలని సూచించారు.డయల్ 100, బ్లూ కోర్ట్ సిబ్బంది గ్రామ గ్రామాన సందర్శిస్తూ సమాచార సేకరణలో ముందుండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు ఎస్సై,యుగంధర్‌రెడ్డి, పోలీసుసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని వేధిస్తున్న వైద్యుల కొరత

- అప్ గ్రేడులతోనే సరి పెడితే ఎలా..?
- మెరుగైన వైద్య సేవలు అందుతున్నా... వసతుల లేమితో ఎదురవుతున్న ఇబ్బందులు
- ప్రసవాలలో రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలవడం హర్షణీయం
- బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్


మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్

**వనపర్తి క్రైమ్, మే10 ప్రభాతవార్త:** ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని అప్ గ్రేడులతోనే సరిపెడితే ఎలా అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు, వైద్యుల కొరత, వైద్య సిబ్బంది కొరతను ఆర్ఎంవో డాక్టర్ జావేద్ ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటగా ఏరియా ఆసుపత్రిగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని కాలక్రమేనా అప్ గ్రేడ్ చేస్తూ నేడు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా మార్చడం, అందులోనూ మెడికల్ కళాశాల మంజూరై టీచింగ్ ఆసుపత్రిగా కూడా కొనసాగుతుందనిఅన్నారు. కేవలం అప్ గ్రేడ్‌తోనే సరిపెడుతున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించకపోవడం వల్ల రోగులకు, రోగుల సహాయకులకు ఇబ్బందులుతలెత్తుతున్నాయన్నారు. ఉన్న కొద్దిమంది వైద్యులే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ పని ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ప్రసవాలలో రాష్ట్రంలోనే


వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న రాచాల

సంగారెడ్డి, మహబూబ్‌నగర్ తర్వాత వనపర్తి మాతా శిశు సంరక్షణ కేంద్రం ఉందని,నెలలో దాదాపు 500 ప్రసవాలు చేస్తూరాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలవడం అభినందనీయమన్నారు.పారిశుద్ధ్య విషయంలో సంతృప్తి ఉన్నప్పటికీ ఇంకాస్త మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా జనరల్ ఆసుపత్రికి అనుగుణంగా వైద్య పోస్టులు లేకపోవడం ఇక్కడి ప్రజలకు ఒక శాపంలా మారిందని, 39 ప్రొఫెసర్ పోస్టులకు గాను 14 మంది మాత్రమే ఉన్నారని, అసోసియేట్ పోస్టులు 26 ఖాళీగా ఉన్నాయని, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు కూడా దాదాపు 65, ట్యూటర్ పోస్టులు 8, ఎస్ ఆర్ పోస్టులు కూడా చాలావరకు ఖాళీగా ఉన్నాయని అన్నారు. స్వయాన ముఖ్యమంత్రి చదువుకున్న జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉండడం సరికాదని, వెంటనే అన్ని రకాల వైద్య పోస్టులను నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయాలన్నారు. నియోజకవర్గ ప్రజలకు సుపరిపాలన అందించే దిశగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను జిల్లా ఇన్చార్జి మంత్రికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆసుపత్రి నిర్మాణ పనులు వీలైనంత త్వరగా మొదలు పెట్టాలన్నారు. పేదలకు మెరుగైన ఉచిత వైద్యం అందాలన్నదే తమ లక్ష్యమని, బీసీ పొలిటికల్ జెఎసి ఆధ్వర్యంలో గతంలో కూడా ఉచిత విద్యా, వైద్యం కోసం పాదయాత్ర చేశామని ఆయన గుర్తు చేశారు. రాచాల వెంట బీసీ పొలిటికల్ జెఎసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్, రామన్ గౌడ్, గిరిధర్ గౌడ్, చందు తదితరులు ఉన్నారు.

## 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

◆ ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు

**మహబూబ్‌నగర్, మే 10 ప్రభాతవార్త:** ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ బైక్ ర్యాలీ మున్సిపల్ టౌన్ హాల్ నుండి ప్రారంభమై కొత్త బస్టాండ్, న్యూటన్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, మెట్టుగడ్డ నుంచి రిటర్న్ గీతా హోటల్, బాయమ్మ తోట, రాజేంద్రనగర్ ,డిఈఓ ఆఫీస్, ఎర్రసత్యం విగ్రహం, తెలంగాణ చౌరస్తా చేరుకొని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి సురేష్, టియుసిఐ రాష్ట్ర నాయకులు సి వెంకటేష్, టిఎన్టియుసి నాయకులు ధన్వాడ రాములు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనాలు రూ. 26వేలు అమలు పరచాలని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రవేటీకరణ నుండి కాపాడాలని,ఎనిమిది గంటల పనిని 12, 14 గంటలకు పెంచే విధానం ఉపసంహరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రతి కార్మికుడికి పిఎఫ్, ఈఎస్ఐ,



ధర్నా నిర్వహిస్తున్న ఆల్‌ట్రేడ్ యూనియన్ నాయకులు


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆల్‌ట్రేడ్ యూనియన్ నాయకులు

గ్రాడ్యుటీ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని, సమ్మె హక్కును నిర్వీర్యపరిచే విధానాన్నిఉపసంహరించాలని బేరసారాల హక్కులు కాపాడాలని ,ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని, బ్యాంకులు, ఎల్ఐసి పోస్టల్ చమురు బొగ్గు గనులను ప్రైవేటు విధానాలను ఉపసంహరించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం రూపొందించి, ప్రమాద భీమా హక్కును రూపొందించాలని,భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డును ఎత్తివేసే ఆలోచన ఉపసంహరించాలని కోరారు. అలాగే సకల కార్మికులందరికీ పని భద్రత, ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు పరచాలని, రైతులకు మద్దతు ధర కనీస గ్యారెంటీ ధర కల్పించాలని, నల్ల చట్టాలను రద్దు పరచాలని, హమాలీలకు సమగ్ర చట్టం రూపొందించాలని,నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించాలని ధరల పెరుగుదల కనుగుణంగా కార్మికుల కనీస వేతనాలు పెంచాలని,కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, డెలివెజేలను రద్దుచేయాలని కోరారు.అదేవిధంగా మే 20న జరిగే సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సమస్త కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీలో సిఐటియు సీనియర్ నాయకులు కిల్లే గోపాల్, కమరలి, జిల్లా కోశాధికారి చంద్రకాంత్,ఐఎన్టీయూసీ నాయకులు రామ్మోహన్,పృథ్వీ సింగ్, ఏఐటీయూసీ నాయకులు గోపాల్ నాయక్, దేవనంద్, టియుసిఐయూ. కృష్ణయ్య,వెంకటస్వామి, వెంకట్, చంటి, రవి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తింపులేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

-ట్రస్మా జిల్లా అధ్యక్షుడు బి లక్ష్మణ్

**భూత్పూర్,మే10,ప్రభాతవార్త:** జిల్లాలో గుర్తింపులేని పాఠశాలలపై కఠినమైన చర్యలు తీసుకుని తక్కువ ఫీజులతో ఎక్కువ జ్ఞానాన్ని అందిస్తూ సామాజిక సేవలో పాలు పంచుకుంటున్న గుర్తింపు పొందిన ప్రవేట్ పాఠశాలలను మనుగడను కాపాడాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) ఉమ్మడి పాలమూరు జిల్లాల అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. శనివారం సాయంత్రం భూత్పూర్,కోయిల్‌కొండ మండలాల కరస్పాండెంట్లతో భూత్పూర్ పట్టణ కేంద్రంలోని న్యూఎరా హైస్కూల్ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ గుర్తింపు లేని పాఠశాలల్లో కొందరు తమ పిల్లల్ని చదివించి వారిని యుడైస్, అపార్‌లలో నమోదు లేకుండా చేస్తున్నారని,ఇలాంటి విద్యార్థులు బోనాఫైడ్,టీసీలు ఇవ్వలేక పోతున్నారని,దీంతో గుర్తింపుపొందిన పాఠశాలల్లో చేర్పించేప్పుడు విద్యార్థులు పలు సమస్యలకు గురి అవుతున్నారని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ ఆవేదన వ్యక్తం


భూత్పూర్,కోయిల్‌కొండ కరస్పాండెంట్లతో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్

చేశారు.మండలాల్లో కరస్పాండెంట్లు పరస్పరం సహకరించుకుని విద్యార్థులతో క్రమశిక్షణతో కూడిన చక్కటి విద్యనందించాలని సూచించారు.ఈ సమావేశంలో భూత్పూర్ కరస్పాండెంట్లు క్రాంతి కుమార్(న్యూఎరా టాలెంట్ స్కూల్),గొడుగు వెంకటయ్య(ఠాగూర్ మెమోరియల్ స్కూల్),కృష్ణమోహన్(సన్‌రైజ్ గ్లోబుల్ స్కూల్)లతో పాటు కోయిల్‌కొండ మండల కరస్పాండెంట్లు వెంకటచారి, నరేందర్‌జీ,కనకయ్య,రాంచందర్,రాములు,లాలు,వెంకట్‌రెడ్డి,వెంకట్రాంరెడ్డి,రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పివి రావు జయంతి



**చిన్నంబావి,మే10 ప్రభాతవార్త:** మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు స్వర్గీయ పివిరావు జయంతి వేడుకలను చిన్నంబావి మండలం దగడపల్లి గ్రామం లో గ్రామ మాల మహానాడు అధ్యక్షుడు బక్కి హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బిజ్జ సహదేవుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పివి రావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పివి రావు భారత దేశంలో సామాజిక సమానత్వానికి పాటుపడిన నేతలలో పోతుల విఘ్నేశ్వర రావు (పీవీ రావు) ఒకరన్నారు. ఆయన దళితుల హక్కుల కోసం పోరాడిన యోధుడు, దళితుల మధ్య అసమానతలను తొలగించి, మాల వర్గ ప్రజలకు న్యాయం చేకూర్చే ప్రయత్నాలలో జీవితాన్ని అంకితం చేసిన నాయకుడనీ కొనియాడారు. గ్రూప్ వన్ ఆఫీసర్‌గా ఐఏఎస్ స్థాయిలో ఉన్నప్పటికీ, సామాజిక సేవ పట్ల ఉన్న ఆకాంక్షతో ప్రభుత్వ ఉద్యోగాన్ని త్యాగం చేసి ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. 1997లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాలను ఎబిసిడి గ్రూపులుగా వర్గీకరించాలని నిర్ణయించడంతో వర్గీకరణ మాలలకు అన్యాయం చేస్తుందని పీవీ రావు వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం సాగించారన్నారు. ఈ విధానంవల్ల మాలల అభివృద్ధి మరింత వెనుకబడుతుందని, వారి హక్కులు క్షీణిస్తాయని గ్రహించి,ఆయన "మాల మహానాడు"అనే ఉద్యమ సంస్థను స్థాపించారు. అనంతరం వర్గీకరణను సుప్రీంకోర్టు కొట్టి వేయడంలో ప్రధాన పాత్ర పోషించిన గుండెపోటుతో మృతి చెందడం దళిత సమాజానికి తీరనిలోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శి బిజ్జా సహదేవ్, బక్కి కృష్ణయ్య, బక్కి రమేష్, బిజ్జా రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీ జవాన్‌కు ఘన నివాళి

**జడ్చర్ల, మే 10 ప్రభాతవార్త:** జడ్చర్ల మండల పరిధిలోని రామస్వామి గుట్ట తండాలో వీర మరణం పొందిన ఆర్మీ జవాన్ మురళి నాయక్ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. పాకిస్తాన్ యుద్ధంలో ప్రాణాలర్పించిన తెలుగు బిడ్డ మురళి నాయక్ చనిపోవడం చాలా బాధాకరం వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని గిరిజన నాయకులు కోరారు. పాకిస్తాన్ ఖబర్దార్ భారత్‌తో పెట్టుకుంటే తీవ్రమైనపరిణామం ఎదుర్కొంటారు. భారత్ తలుచుకుంటే ప్రపంచ పటంలో పాకిస్తాన్ దేశాన్ని లేకుండా చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామ స్వామి గుట్ట తండా గిరిజన నాయకులు, యువకులు తండా గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న తండావాసులు

## పార్టీ మండల అధ్యక్షులుగా యువతకు ప్రాధన్యత కల్పించండి

దామరగిద్ద మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంగు శ్రీనివాస్

**నారాయణపేట టౌన్, మే 10 ప్రభాతవార్త :** ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటూ ప్రతి సమస్యపై స్పందించే యువ నాయకున్ని దామరగిద్ద మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకోవాలని దామరగిద్ద మండలం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మంగు శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మండల అధ్యక్షుడి ఎంపిక విషయంలో ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి స్పందించి యువ నాయకునికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. పార్టీ మారకుండా ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ కార్యకర్తలకు అండగా ఉంటూ ఇతర పార్టీలనాయకుల ఒత్తిడినితట్టుకునే యువ నాయకుడికి ప్రాధాన్యత నివ్వాలన్నారు. పార్టీలో చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరిని కలుపుకుపోయే వ్యక్తికి అవకాశం కల్పించాలన్నారు. కార్యకర్తలను కలుపుకుపోయే తత్వంలేని కారణంగా మండలంలో కాంగ్రెస్‌పార్టీ రోజురోజుకుబలహీన పడుతుందన్నారు. మండలంలో ప్రతి కార్యకర్త ఇదే కోరుకుంటున్నారన్నారు. కార్యకర్తల కోరిక మేరకు యువ నాయకుడికి ప్రాధాన్యత ఇవ్వాలని మండల నాయకులు కార్యకర్తలు కోరుచున్నారు.

## పేటలో మోప రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ జన్మదిన వేడుకలు



**నారాయణపేట టౌన్, మే 10 ప్రభాతవార్త:** మోప రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ జన్మదిన వేడుకలను శనివారం నారాయణపేట పట్టణంలో నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. అనంతరం పరుగులు మాట్లాడుతూ మోప నారాయణపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు.ఈ కార్యక్రమంలో సరాఫ్ నాగరాజు ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు,ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కాంత కుమార్ జిల్లా మత్స్యశాఖ అధ్యక్షులు,వెంకట్ రాములు ముదిరాజ్,నేరడి రాఘవేందర్ నాయుడు ముదిరాజ్, మోప నారాయణపేట జిల్లా శాఖ అధ్యక్షులు, జూల్ వెంకటేష్ ముదిరాజ్, మోప జిల్లా గౌరవ అధ్యక్షులు కావాలి రాజ్ కుమార్ ముదిరాజ్, మోప జిల్లా ప్రధాన కార్యదర్శి మరాటి నారాయణ ముదిరాజ్, జిల్లా సలహాదారులు, పోలేమోని గోవింద రాజులు ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు, నక్క శ్రీనివాసులు ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

**నారాయణపేట టౌన్, మే10 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని దయానంద విద్యా మందిర్ ఉన్నత పాఠశాలలో 2000,2001 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత రజతోత్సవంగా పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్నిశనివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు తాజా పరిస్థితులను కుటుంబ వివరాలను సభా వేదికగా పంచుకున్నారు. విద్యా బుద్దులు నేర్పిన అధ్యాపకులను కార్యక్రమానికి ఆహ్వానించి పాఠశాల చదువుకునే సమయంలో జరిగిన విషయాలను గుర్తు చేసుకొని సంతోషంవ్యక్తం చేశారు.అనంతరం ఆటపాటలతో విందు కార్యక్రమంతో గడిపిఅధ్యాపకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికుడికి మజీద్ కమిటీ సన్మానం


హజ్ యాత్రకు వెళ్తున్న అబ్దుల్ ఖాదర్‌ను సన్మానిస్తున్న మజీద్ కమిటీ సభ్యులు

**భూత్పూర్,మే 10,ప్రభాతవార్త :** వారం రోజుల్లో హజ్ యాత్రకు బయలుదేరి వెళ్తున్న భూత్పూర్ పట్టణ కేంద్రానికి చెందిన కటికే అబ్దుల్ ఖాదర్‌ను భూత్పూర్ మజీద్ కమిటీ సభ్యులు శనివారం రాత్రి ఘనంగాసన్మానించారు.భూత్పూర్ ఉమ్మడి మజీదుల కమిటీ అధ్యక్షుడు బాబాషర్ఫొద్దిన్,ప్రధాన కార్యదర్శి మొహ్మద్ ఆహ్మద్, ఉపాధ్యక్షులుమొహ్మద్ యాసిన్,మొహ్మద్ ఖాసిం, కార్యదర్శి మొహ్మద్ అబ్దుల్ నయీం,భూత్పూర్ మండల మాజీ కోఆప్షన్ సభ్యుడు మొహ్మద్ ఖదీర్,మత పెద్దలు మక్బూల్ ఆహ్మద్, మొహ్మద్ అశ్వక్ తదితరులు సన్మానించినవారిలో ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న బిజెపి నాయకులు

**మాగనూరు, మే10 ప్రభాతవార్త:** మాగనూర్ మండలం గురురావులింగం పల్లి గ్రామంలో వారం రోజుల క్రితం గద్వాల జిల్లాలో ప్రమాదంలో మృతి చెందిన నర్సింగ్ విద్యార్థి మహేశ్వరి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని ఇచ్చారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. మృతి చెందిన మహేశ్వరి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందచేసిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరోళ్ల రవికుమార్, జిల్లా ఉప అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, మక్తల్ నియోజక వర్గ ముఖ్య నాయకులు ఉన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

**రాజాపూర్, మే10 ప్రభాతవార్త:** నిరుపేదల ఆరోగ్యానికి భరోసాగా సిఎం సహాయనిధి అండగా నిలుస్తుందని కాంగ్రెస్ పార్టీ రాజాపూర్ మండల అధ్యక్షులు కత్తెర కృష్ణయ్య యాదవ్ అన్నారు. సీఎం సహాయనిధి నుండి వచ్చిన చెక్కులను లబ్దిదారులకు శనివారం రాజాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన అందజేశారు. ఆయా లబ్ధిదారులు వాటిని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

## సీమాంజనేయ ఆలయంలో శనిత్రయోదశి పూజలు



ఆంజనేయస్వామి ఆలయంలో శనిత్రయోదశి పూజలుచేస్తున్న భక్తులు

**సిర్గాపూర్, మే 10, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఉజలంపాడ్, చాప్టా గ్రామాల శివారులో స్వయంభూ శ్రీసీమాంజనేయస్వామి ఆలయంలో శనివారం శనిత్రయోదశి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో అర్చకులు ప్రవీణ్ పంతులు గురుస్వామి వేదమంత్రాలు వల్లిస్తూ అభిషేకంచేసి సింధూరాన్ని అద్ది రంగురంగుపూలు, తమలపాకులతో అందంగా అలంకరించి ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ప్రసాదవితరణ(అన్నదానం) చేశారు. ఆలయానికి గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామివారి దర్శనానికి ఇబ్బందులు పడకుండా దేవస్థాన ధార్మిక ఆధ్యాత్మిక సేవా సమితి బాధ్యులు సంజీవులు, గురునాథ్, సంజీవరెడ్డి, గాల్‌రెడ్డి, తుకారాం పాటిల్, గోవింద్‌రెడ్డి, నరసింహారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాములు నాయక్‌లు తగు ఏర్పాట్లు చేశారు.

## హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
**-అన్నదాతలను సన్మానించిన భక్తులు**

**మనూర్, మే 10, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన మనూర్‌తోపాటు మండలపరిధిలోని దవ్వూర్ గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండలకేంద్రమైన మనూర్‌లోని హనుమాన్ ఆలయంలో ప్రతివారం ఆలయంలో ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శిరూర్ మాణెమ్మ, సాయిలు దంపతులు ఆలయానికి చేరుకున్నభక్తులకు అన్నదానం సౌకర్యం ఏర్పాటు చేశారు. అన్నదాన వితరణ చేసిన మాజీ సర్పంచ్ దంపతులను గ్రామభక్తులు శాలువాతో సత్కరించారు.

**-దవ్వూర్‌లో పూజలు, అన్నదానం...**
మండలపరిధిలోని దవ్వూర్ లొంక గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారాన్ని పురస్కరించుకుని గ్రామస్థులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పట్లోళ్ల మహానంద, కాశీనాథ్ దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## జలమండలి ఎండిని కలుసుకున్న కార్పొరేటర్



ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, మే 10, ప్రభాతవార్త:**
హైద్రాబాద్‌లోని ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో జలమండలి మేనేజింగ్‌డైరెక్టర్ అశోక్‌రెడ్డిని శనివారం కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బూరుగడ్డ పుష్పనగేష్ మర్యాదపూర్వకంగా కలుసుకుని రామచంద్రాపురం డివిజన్‌లో నెలకొన్న డ్రైనేజి సమస్యను విన్నవిస్తూ వినతిపత్రం అందచేశారు. ఇటీవలే కొన్న డ్రైనేజీలైన్ కొరకు నిధులు మంజూరు చేసినందుకు ఎండి అశోక్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ వారంరోజుల్లో పనులు ప్రారంభించి సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ ఎండి అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయారు.

## 5664 క్వింటాళ్ల వరి కొనుగోలు



సిర్గాపూర్‌లో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు దృశ్యం

**సిర్గాపూర్, మే 10, ప్రభాతవార్త:**
మండలంలోని ఆయాగ్రామాల్లో ఇందిరా క్రాంతిపథకం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలుకేంద్రంలో రైతులనుంచి 5664.80 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు కేంద్రం అధికారులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన సిర్గాపూర్‌తో పాటు మండల పరిధిలోని గోసాయిపల్లి, కడపల్, పోచాపూర్, సంగం, సుల్తానాబాద్, గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయన్నారు. 120మంది రైతుల నుంచి 14162 సంచులు 5664.80 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని ఐకెపి ఎపిఎం అనంతయ్య పేర్కొన్నారు.

## ఎంఈడబ్ల్యుఎ నూతన కార్యవర్గం

**సిద్దిపేట రూరల్, మే 10, ప్రభాతవార్త:**
సిద్దిపేట జిల్లా ముస్లిం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మహ్మద్ ఫకృద్దీన్, ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఉస్మాన్, ఉపాధ్యక్షులుగా ఎం.ఎ.అజీజ్, ఎం.డి.సాజిద్, కార్యదర్శులుగా ఎం.డి.గౌస్, ఎం.డి.జమీలొద్దీన్, ఆర్థిక కార్యదర్శిగా కె.యు.ఆలం, పిఆర్‌ఓగా ఎం.డి.రుక్మొద్దీన్‌లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా ఎం.డి.మౌలానుద్దీన్, ఎం.డి. జహంగీర్, ఎం.డి.అన్వర్, సయ్యద్ ముజీబ్‌అలీ, సయ్యద్ సంధాని, షేక్ బషీర్, ఎం.డి. ఖుద్రత్‌అలీ, షేక్ సాదక్‌పాషలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా సయ్యద్ షౌకత్ అలి, మహ్మద్ మహుమూద్‌లు వ్యవహరించారు.

## మండల యాదవసంఘం ఏకగ్రీవ ఎన్నిక

**చిన్నకోడూరు, మే 10, ప్రభాతవార్త:**
చిన్నకోడూరు మండల యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కిష్టాపూర్ గ్రామానికి చెందిన సందబోయిన పర్శరాం యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బంక పోచయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శిగా సిద్దుల శ్రీనివాస్, కార్యదర్శులుగా సందబోయిన వెంకటనర్సయ్య, పొట్ల ఎల్లయ్య, కోశాధికారిగా ఇస్కిల్ల పర్శరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల యాదవనాయకులు కాల్వ ఎల్లయ్యయాదవ్, వంగ సంపత్ యాదవ్, మీసం మహేందర్‌యాదవ్, ముక్కెర శ్రీనివాస్‌యాదవ్, జక్కుల రాములుయాదవ్, రాజుయాదవ్, బాలకిషన్‌యాదవ్, మల్లేశంయాదవ్, శ్రీనుయాదవ్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## హేమారెడ్డి మల్లమ్మ జయంతి వేడుకలు

నాగల్‌గిద్ద, మే 10, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఉట్పల్లిలో వేమారెడ్డి మల్లమ్మ జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేమారెడ్డి చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవరెడ్డి, నాయకులు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు
**-నాగప్రతిష్ఠ చేసి మొక్కుతీర్చుకున్న మైనంపల్లి హనుమంతరావు**



ఆలయంలో నాగప్రతిష్ఠ పూజలుచేస్తున్న మైనంపల్లి హనుమంతరావు

**గజ్వేల్, మే 10, ప్రభాతవార్త:**
గజ్వేల్ మండలం దిలాల్‌పూర్‌లోని స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో మల్కాజిగిరి మాజీఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు నాగదేవత ప్రతిష్ఠ చేశారు. ఈసందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ గత సంవత్సరం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నాగప్రతిష్ఠను చేస్తానని మొక్కుకున్నట్లు పేర్కొన్నారు. శనివారం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకొని ఏర్పాటుచేసిన నాగప్రతిష్ఠకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. గత రెండురోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో తిరుమల రఘునాథచార్యులు వైదిక నిర్వహణలో ప్రతిరోజు ఆలయంలో పురుషసూక్త సహిత మూలమంత్ర హవనములు నిర్వహిస్తున్నారు. ఆదివారం సుదర్శన హోమం, లక్ష్మీనరసింహస్వామికి శతకటాభిషేకం, చక్రస్నానం, అనంతరం స్వామి వారి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఆదివారం సాయంత్రం స్వామివారి పుష్ప రథోత్సవం జరుగనున్నట్లు ఆలయ పురోహితులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బురుజుకింది సంతోష్‌రెడ్డి, కోశాధికారి అత్తెల్లి రాజేశంగుప్త, కార్యదర్శి రఘుపతిరెడ్డి, ఆలయకమిటీ సభ్యులు నరసింహారెడ్డి, రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి, ముత్యంరెడ్డి, రవీందర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం మాజీ కన్వీనర్ చిట్కుల మహిపాల్‌రెడ్డి, పిసిసి రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, ఆత్మకమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్రనాయకులు గాడిపల్లి రఘువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్త, విజయ్‌కుమార్, కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రటరీ మహ్మద్ ఎక్బాల్, అనిల్‌రెడ్డి, ఆత్మకమిటీ డైరెక్టర్ కృపానందం, క్యాసారం బాబా, ఆంజనేయులుగౌడ్, కప్పు భాస్కర్, నాయిని తిరుపతి, ప్రవీణ్, జాని, రాజు, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మెథడిస్ట్ ఉత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే



జాతర ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, మే 10, ప్రభాతవార్త:**
పట్టణంలోని గార్డెన్‌నగర్ అల్లిపూర్ మెథడిస్ట్ సెంట్రల్‌చర్చి 95వ క్రైస్తవ జాతరను శనివారం డిఎస్ సుకుమార్, డిస్ట్రిక్ట్ లే లీడర్ సరీన్ జాన్, ప్రధాన కార్యదర్శి రవవికుమార్, పాస్టర్లతో కలిసి ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌లు జెండా ఊపి ప్రారంభించారు. 3రోజులపాటు కొనసాగే జాతర ఉత్సవాలకు నియోజకవర్గంలోని ఆయాగ్రామాల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో జెండాలతో ఊరేగింపుతో చేరుకుని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## మిషన్ భగీరథ డిఈగా సృజన్‌కుమార్



ఎమ్మెల్యేను కలుసుకున్న సృజన్ చక్రవర్తి

**జహీరాబాద్, మే 10, ప్రభాతవార్త:**
మిషన్ భగీరథ జహీరాబాద్ డివిజన్ ఇంచార్జి డీఈగా ఝరాసంగంమండలం ఏఈఈగా విధులు నిర్వహిస్తున్న సృజన్ చక్రవర్తిని నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించి మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావును కలుసుకుని బొకేను అందచేశారు. ఇంతవరకు డిఈగా విధులు నిర్వహించిన సాబేర్ ఆహ్మద్ స్థానంలో సృజన్ కుమార్ పదవి బాధ్యతలు స్వీకరించారు.

## నిరుపేద వధువుకు పుస్తె మెట్టెలు పంపిణీ

**రామాయంపేట మున్సిపాలిటీ, మే 10, ప్రభాతవార్త:**
రామాయంపేట మున్సిపాలిటీ 4వ వార్డు పరిధిలోని బిసి కాలనీకి చెందిన నిరుపేద వధువు వివాహానికి ప్రముఖ సంఘసేవకులు జొన్నల బాలు అండగానిలిచారు. శనివారం భూమొల్ల శ్యామల, సత్తయ్య కుమార్తె లావణ్య వివాహానికి పుస్తెమెట్టెలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బిసి కాలనీకి చెందిన యువకులు పాల్గొన్నారు.

## వెండికోల్‌లో రేణుక ఎల్లమ్మ జాతర
**-ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం**



వెండికోలులో ఉత్సవాలు ముస్తాబైన రేణుక ఎల్లమ్మ దేవాలయం

**చౌటకూరు, మే 10, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని వెండికోల్‌లో కొలువుండి భక్తులతో నిత్యపూజలందుకుంటూ భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీరేణుక ఎల్లమ్మతల్లి దేవాలయం జాతర ఉత్సవాలు ఈనెల 12వ తారీఖున ప్రారంభం అయి 14వ తేదీవరకు నిర్వహించనున్నారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 7,8,9వ తారీఖులలో ఆదారశిల(బొడ్డురాయి) ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కొనసాగే జాతర ఉత్సవాలకు అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు తమ కుటుంబ సభ్యులతో గ్రామానికి చేరుకుంటుండటంతో గ్రామం ఆడపడుచులతో సందడిగా మారింది. ఆలయానికి, మండపానికి రంగులద్ది విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈనెల 12న గంగకుపోవుట, 1న శ్రీరేణుక ఎల్లమ్మతల్లికి మహాభిషేకం, కళ్యాణం, బోనాలు, రథం, 14న గ్రామ శివారు చుట్టూ బండ్ల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

## జవాన్‌కు వాకర్ అసోసియేషన్ సంతాపం

**రామాయంపేట మున్సిపాలిటీ, మే 10, ప్రభాతవార్త:**
రామాయంపేటలో వాకర్ అసోసియేషన్ సభ్యులు అమర జవాన్ మురళి నాయక్‌కు నివాళులు అర్పించి, సంతాపం వ్యక్తం చేశారు. శనివారం వారు ఉదయం వాకింగ్ సమయంలో భారత్-పాక్ యుద్ధంలో వీరమరణంపొందిన అమర జవాన్ మురళినాయక్‌కు సంతాపం తెలిపారు. ఆయనమృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. "ఆపరేషన్ సిందూర్" కు మద్దతుగా నిలవాలని నినాదాలు చేశారు. ఆపరేషన్ సిందూర్-2 విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుంకోజు దామోదర్ చారితోపాటు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## దేవాలయ పునర్నిర్మాణానికి విరాళం

**మర్కుక్, మే 10, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని వరదరాజ్‌పూర్ గ్రామంలోగల భూనీలసమేత వరదరాజస్వామి దేవాలయ పునర్నిర్మాణానికి ఎర్రవల్లి మాదిగసంఘం ఎడమవాడ కట్టు వారు రూ.23వేల విరాళాన్ని కులపెద్ద ఆవులకాడి మల్లేశం చేతుల మీదుగా ఆలయట్రస్టు చైర్మన్ గోపాలకృష్ణశర్మ, తుమ్మ కృష్ణలకు అందజేశారు. కార్యక్రమంలో పొట్టోల్ల దాసు, ఎడమ కరుణాకర్, ముక్కిడి దావీదు, అక్కారం బిక్షపతి, ముక్కిడి గణేష్, సైదు రవి, ఎడమ ప్రశాంత్, చీరాల ప్రశాంత్, భూమయ్య, నరేష్, చంద్రం, పరశురాములు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
**-సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జె.సంతోష్**

**మెదక్ అర్బన్, మే 10, ప్రభాతవార్త:**
కార్మిక వ్యతిరేక 4లేబర్‌కోడ్స్‌ను రద్దు చేయాలని కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని, ఈనెల20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని, సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మెదక్ టౌన్‌లో ఆవిష్కరించడం జరిగింది. ఈసందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి జె.సంతోష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తుందని అన్నారు. కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాలు సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటిస్థానంలో 4లేబర్‌కోడ్‌లను ముందుకు తీసుకొచ్చిందని అన్నారు. ఈ కోడ్‌ల ద్వారా కార్మికులను తిరిగి బానిసత్వంలోకి నెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో 2025 మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో యాచారం మండలంలోని అన్నిరంగాల కార్మికులు పాల్గొని జయప్రదంచేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిఐటియు యూనియన్ నాయకులు బాలనర్సు, సాయిలు, శౌకత్ అలీ, హలీమ్, రాజు, కృష్ణ, కుమార్, కొమరయ్య, గట్టయ్య, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశప్రజలమంతా సైనికులకు అండగా నిలుద్దాం
**-కాంగ్రెస్ నాయకులు హరికృష్ణ, అత్తు**



డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్స కార్యక్రమంలో మాట్లాడుతున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, మే 10, ప్రభాతవార్త:**
చిరకాల ప్రత్యర్థి అయిన పాకిస్తాన్‌తో యుద్ధం చేస్తున్న భారత సైనికులకు ఆభగవంతుడు అండగా నిలిచి వారికి మరింత శక్తినివ్వాలని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి పూజల హరికృష్ణ, సిద్దిపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.డి.ఇమామ్(అత్తు) ప్రార్థించారు. జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరాలయంలో శనివారం కాంగ్రెస్‌పార్టీకి చెందిన 13మంది దేవాలయ డైరెక్టర్లుగా ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాంలో పర్యటనకు వెళ్లిన పర్యాటకులపై పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్పులు జరపడం అమానుషమన్నారు. పాకిస్తాన్ చేస్తున్న కవ్వింపు చర్యలకు భారత సైనికులు గట్టి గుణపాఠం చెబుతున్నారని తెలిపారు. దేశప్రజలమంతా సైనికులకు అండగా నిలుద్దామన్నారు. దేవాలయంలో నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన డైరెక్టర్లు ఆలయ అభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈనెల 17 నుంచి 23వరకు జరిగే స్వామివారి 50యేండ్ల బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. బ్రహ్మోత్సవాలకు శ్రీచిన్నజీయర్‌స్వామి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీనాయకులు లక్ష్మీ, గంప మహేందర్ రావు, యాదగిరి, సతీష్, పద్మ, కవిత, సాంబమూర్తి, వెంకటేశ్వర దేవాలయ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## గోడ పత్రికను ఆవిష్కరించిన పీఠాధిపతి

**ఝరాసంగం, మే 10, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కక్కరవాడ గ్రామంలో ఈ నెల 14న నిర్వహించే శ్రీ రామలింగేశ్వరస్వామి, నందివిగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర పూజా కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రికను శనివారం మండలపరిధిలోని బర్దీపూర్ గ్రామంలోని శ్రీదత్తగిరి ఆశ్రమంలో ఆశ్రమపీఠాధిపతి, 1008 మహామండలేశ్వర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ బాధ్యులు బోపల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వీర్‌శెట్టి, నవీన్‌రెడ్డి, నరసింహులు, వైదిక పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవాలకు హాజరు కావాలని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు హన్మంత రావుపాటిల్, ఎస్ఐ నరేష్‌లను ఆహ్వానించారు.

## సంగారెడ్డి జిల్లా కెమిస్ట్రీ అసోసియేషన్ ఎన్నిక

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 10, ప్రభాతవార్త:**
సంగారెడ్డిజిల్లా మెడికల్ అసోసియేషన్ శనివారంనిర్వహించిన సంగారెడ్డిజిల్లా కెమిస్ట్రీఅసోసియేషన్ కార్యవర్గంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన ఈర్న కృష్ణయ్యను జిల్లా అధ్యక్షుడిగా, అనుముల సంతోష్‌కుమార్‌ను ప్రధాన కార్యదర్శిగా ఎదురే రమేష్‌ను కోశాధికారిగా ఎన్నుకున్నారు. ఎన్నికలకు ముఖ్యఅతిథిగా టిటిసిడిఏ కోశా ధికారి తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ తుడుపునీరు రాజు గౌరవ అతిథులు ఐటీసీడ్ ఈసీ మెంబర్ చంద్రశేఖరరావు, పి.వెంకట్, పి. కృష్ణకుమార్, వి.శ్రీనివాస్, టి.సుధాకర్, టిటిసిడిఏ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.వెంకటేశ్వర్లు, టిటిసిడిఏ వైస్‌ప్రెసిడెంట్ మెదక్‌జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సంగమేశ్వర్, మెదక్ జిల్లా కోశాధికారి జి.శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా కోశాధికారి డి.వినోద్, తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ వి.నాగసాయి శ్రీకేష్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డిపట్టణ అధ్యక్షులు కలివే ముల దశరథ పట్టణ ప్రధాన కార్యదర్శి శశికాంత్ చందన్ కోశాధికారి కె.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాలిసెట్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 10, ప్రభాతవార్త:**
ఈనెల 13న జరిగే పాలిసెట్ పరీక్షలనిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అయి నట్లు సంగారెడ్డి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జానకిదేవి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ సంగారెడ్డిలో 7పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈపరీక్షలలో మొత్తం 2784 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్షలునిర్వహించే కేంద్రాలను శని వారం ఆమె సందర్శించారు. పరీక్ష ఉదయం 11గంటల నుంచి 1:30 నిమిషాల వరకు జరుగుతుందని అన్నారు.

## ఘనంగా గ్రాడ్యుయేషన్స్ డే

**సంగారెడ్డి మున్సిపాలిటీ, మే 10, ప్రభాతవార్త:**
సంగారెడ్డి సమీపంలోని ఎమ్మెన్నార్ స్కూల్, కాలేజ్ ఆఫ నర్సింగ్ లో గ్రాడ్యుయేషన్ డెను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ నర్సింగ్ ప్రొఫెసర్ డాక్టర్ విద్యుల్లత నిన్న కళాశాల చైర్మన్ అండ్ ప్రెసిడెంట్ ఎం ఎం రాజు, చాన్సులర్ రవి వర్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రాడ్యుయేషన్ పూర్తి అయిన విద్యార్థులందరికి పట్టా సర్టిఫికెట్లు అందజేశారు.

## సిఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసిలు అందజేసిన ఎమ్మెల్యే

**జహీరాబాద్, మే 10, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఆయాగ్రామాలకు చెందిన 17మంది మెరుగైనచికిత్స అందుకునేందుకు ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు శనివారం 4లక్షల 87 వేల రూపాయల ఎల్‌ఓసిలను పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందచేశారు. సత్వార్‌గ్రామానికి చెందిన లలితకు 25వేల5 వందలు, కృష్ణకు 48వేలు, లక్ష్మికి 17వేల5వందలు, ఆనెగుంటగ్రామానికి చెందిన అనితకు 32వవేల5వందలు, హుగ్గెల్లికి చెందిన బేబీ లతకు 32వేల5వందలు, అల్గోల్‌గ్రామానికి చెందిన బక్కన్నకు 21వేలు, రాయిపల్లి(డి) గ్రామానికి చెందిన సరితకు 15వేలు, బాగమ్మకు 60వేలు, మల్చెల్మ గ్రామానికి చెందిన గునిబాయికి 22వేల5వందలు, బూచినెల్లికి చెందిన శాబుద్దీన్‌కు 37వేలు, హోతి(బి)గ్రామానికి చెందిన మోహియుద్దీన్‌కు 30వేలు, మధులై తండాకు చెందిన రాథోడ్ మోహన్‌సింగ్‌కు 16వేల5వందలు, షేకాపూర్‌గ్రామానికి చెందిన జైపాల్‌కు 36వేలు, గోవింద్‌పూర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డికి 34వేలు, ఖాసింపూర్‌కు చెందిన గంగమ్మకు 24వేల రూపాయల ఎల్‌ఓసిలను ఎమ్మెల్యే అందచేశారు. కార్యక్రమంలో మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు తట్టునారాయణ, పాక్స్ చైర్మన్ మచ్చేందర్, పార్టీ ప్రధానకార్యదర్శి మహన్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, బిసి సెల్, ఎస్టీ సెల్, మైనార్టీ సెల్ అధ్యక్షులు అమిత్‌కుమార్, హిరూ రాథోడ్, వహిద్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ప్రశాంతత
**-మండల అధ్యక్షుడు వాసరి లింగరావు**



క్రీడకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

**కొండపాక, మే 10, ప్రభాతవార్త**
యువకులు చదువుతోపాటు క్రీడల్లోను అసక్తికలిగి ఉండాలని కొండపాక మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు వాసరి లింగరావు, పిఎసిఎస్ డైరెక్టర్ బూర్గుల సురేందర్ యువతకు సూచించారు. శనివారం వెలికట్టలో క్రికెట్ టోర్నమెంటును ప్రారంభించి వారు మాట్లాడారు. క్రీడలవల్ల మానసిక అనందంలభిస్తుందన్నారు. డ్రగ్స్‌కు, మత్తుపదార్థాలకు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. క్రీడలవల్ల మానసిక ప్రశాంతతతోపాటు శరీరదారుఢ్యం పెంపొందుతుందన్నారు. మత్తుపదార్థాలకు, బానిసలై కన్నతల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేయవద్దని కోరారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల మూలంగా ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని వాపోయారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగాల్లో మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ అర్గనైజర్ దొమ్మట మహేష్, రజినికాంత్, ఎర్రబోయిన నరేష్, సతోష్, అరుట్ల సంపత్, వివిధ గ్రామాల క్రీడకారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణకు పెద్ద పీట
**-సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి**




అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

**కోహెడ, మే 10, ప్రభాతవార్త:**
ఏదైనా సంఘటనజరిగితే మహిళలు మౌనంవీడి పోలీసులకు తెలియజేయాలని, మహిళల రక్షణకు పెద్దపీటవేయడం జరుగుతుందని హుస్నాబాద్ షీటీమ్‌బృందం తెలిపారు. మండలపరిధిలోని సముద్రాలగ్రామంలో శనివారం మహిళలకు, ప్రజలకు చట్టాలు, సైబర్‌నేరాలు, రోడ్డుప్రమాదాలపై హుస్నాబాద్ షీటీమ్‌బృందం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా షీటీమ్‌బృందం మాట్లాడుతూ సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలను ఎవరైనా వేధింపులకుగురిచేసినా, అవహేళనగామాట్లాడినా వెంటనే డయల్ 100 లేదా పోలీసు కమిషనరేట్ షీటీమ్‌నంబరు 8712667434కు కాల్‌చేయాలన్నారు. అవగాహన సదస్సులో కోహెడ హెడ్‌కానిస్టేబుల్ కొమురయ్య, కనకయ్య, హుస్నాబాద్ షీటీమ్‌బృందం హెడ్‌కానిస్టేబుల్ సదయ్య, మహిళాకానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

**చౌటకూరు, మే 10, ప్రభాతవార్త:**
రోడ్డుప్రమాదంలో గాయపడి గాయాలకు గురైన మండల పరిధిలోని చక్రియాల గ్రామానికి చెందిన కాశపాగ బాలనాగమ్మ కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైనచికిత్స అందుకునేందుకు 28వేల5వందల రూపాయల సిఎంఆర్‌ఎఫ్ చెక్కును వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ సూచనల మేరకు గ్రామ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు చిన్నరోళ్లపాటి రాజశేఖర్ శనివారం బాధిత కుటుంబసభ్యులకు అందచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు ఆనందం, లింగయ్య, తుంగె రాములు, మన్నె నర్సింలు, నీరుడి లక్ష్మీనారాయణ, పద్మారావు, పోచయ్య, ఎవాన్, శంకరయ్య, పెంటయ్య, తలారి అశోక్, శ్రీను, జనార్ధన్, మన్నె గోపాల్, జంగలి బుడయ్యలు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో వ్యక్తి మృతి

**దుబ్బాక, అక్బర్‌పేట భూంపల్లి, మే 10, ప్రభాతవార్త:**
అప్పులబాధతో వ్యక్తి మృతిచెందిన సంఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలపరిధిలోని చిట్టాపూర్‌గ్రామంలో శనివారం జరిగింది. అక్బర్‌పేట భూంపల్లి ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన గంగాల పరశురాముడు (40) భార్య రేణుక వీరికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. పరశురాముడు వ్యవసాయం చేసుకుంటు కుంటుబాన్ని పోషించుకుంటున్నాడు. భూమి సాగుచేసి, వచ్చిన డబ్బులు కుటుంబాన్ని పోషించడానికి సరిపోవడం లేదని ఆర్థిక ఇబ్బందులతో తాగుడుకు అలవాటు పడి అప్పులు చేయడం మొదలు పెట్టాడు. అప్పులు అధికం కావడంతో నిన్న సాయంత్రం ఏడు గంటలకు పరశురాములు బయటకువెళ్తున్నా అని చెప్పి ఇంటినుండి వెళ్లిపోయాడు. రాత్రి పరశురాములు ఇంటికి రాకపోయేసరికి ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. శనివారం ఉదయం 9గంటలకు పొలందగ్గర గల మామిడి చెట్టుకు చీరతో ఉరి వేసుకొని మృతిచెంది ఉన్నాడు. స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పరశురాములు ఆర్థిక ఇబ్బందులు భరించలేక మద్యానికి అలవాటు పడి జీవితంపై విరక్తిచెంది ఎవరు లేని సమయంలో తానకుతాను చీరతో ఉరివేసుకొని మృతిచెందాడు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు దుబ్బాక ప్రభుత్వం ఆసుపత్రిలో పోస్టుమార్ధ నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

## అప్పుల బాధతో తండ్రి ఆత్మహత్య

**కొల్చారం, మే 10, ప్రభాతవార్త:**
కొడుకు చేసిన అప్పుల బాధ భరించలేక ఓతండ్రి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొల్చారంమండలం సంగాయిపేట గ్రామంలో చోటుచేసుకుంది. మృతుని భార్య వసంత కథనం ప్రకారం సంగాయపేట గ్రామానికి చెందిన మన్నె శేఖర్ కుమారుడు మన్నే సాయిచరణ్ అప్పులు చేయడంతో అప్పులు ఇచ్చినవారు ఇంటికిరావడం కొడుకుచేసిన అప్పులకు మనస్తాపానికి గురై తండ్రి మన్నె శేఖర్ శనివారం తెల్లవారుజామున ఇంట్లో నుండి వెళ్లిపోయి గ్రామ శివారులోని తమ పొలంలో సోలార్ హై టెన్షన్ టవర్ కి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని కొల్చారం ఎస్సై మహమ్మద్ గౌస్ పరిశీలించి కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.